# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తి ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 112 గురువారం 15 జూన్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## వినతుల పరిష్కారంలో క్వాలిటీ ముఖ్యం

**ప్రభుత్వ సంక్షేమ పథకాల**

**పురోగతి పై సీఎం జగన్ సమీక్ష**

**ప్రజా తపన , అమరావతి**



తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు ,ఎస్పీలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సంతృప్తి స్థాయిలో అర్జీలు పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు , జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచాలని, జగనన్న సురక్ష పథకం అమలు లో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి వాళ్లని కలిసి వారికి అవసరమైన సంక్షేమ పథకాలఅర్హతను బట్టి అందని పక్షంలో వారి పరిస్థితిని తెలుసుకొని పథకాలపై అవగాహన కల్పించాలి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎదురియే సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి 20 లక్షల రూపాయలు నిధులు కేటాయించి పనుల మంజూరు గురించి మాట్లాడారు. అగ్రికల్చర్ – ఈక్రాప్ బుకింగ్, కౌలు రైతులకు అందజేస్తున్న సిసిఆర్సి కార్డులు, రైతులకు బ్యాంకు బ్యాంకు రుణాలు, రైతులకు అవగాహన కల్పించడం, వ్యవసాయ రుణాలు పై జిల్లా కలెక్టర్లు బ్యాంకర్స్ తో సమావేశం ఏర్పాటు చేసుకోవడం, జూలై 15

02

## వైద్యానికి మానవ జీవితానికి ఎడతెగని సంబంధం

**వైద్యారోగ్య రంగంపై చక్కటి**

**ప్రణాళికలు రూపొందించాలి**

**నిమ్స్ లో 2000 పడకల ఆస్పత్రికి**

**శంకుస్థాపన**

**1571 కోట్లతో నిర్మాణం**

**ప్రజా తపన ,హైదరాబాద్ :**



నిమ్స్‌లో కొత్తగా నిర్మించబోయే బ్లాక్‌కు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఏర్పాటు చేసిన ఈ బ్లాక్‌కు దశాబ్ది బ్లాక్ అని పేరు పెట్టారు. ఈ బ్లాక్ ఏర్పాటుతో నిమ్స్‌లో మరో 2000 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రితోపాటు ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. మొత్తం 33 ఎకరాల్లో నిమ్స్ విస్తరణ పనులు చేపట్టారు. భవిష్యత్తులో పెరుగనున్న రద్దీ, విస్తృతం కానున్న స్పెషాలిటీలను దృష్టిలో పెట్టుకొని విస్తరణ పనులు జరగనున్నాయి. మూడు బ్లాకులు ఈ కొత్త దశాబ్ది భవనం నిర్మించనున్నారు. 8 అంతస్థుల్లో ఓపీ బ్లాక్, ఎమర్జెన్సీ సేవలకు 8 అంతస్థుల బ్లాక్, ఇన్‌పేషంట్ల కోసం 13 అంతస్థులతో బ్లాక్ సిద్ధం చేయనున్నారు. కొత్త భవనంలో 30 ఆపరేషన్ థియేటర్లు ఉంటాయని తెలుస్తోంది. 2 వేల పడకి కూగా ఆక్సిజన్ సరఫరా ఉంటుంది. ఇందులో 1,200 ఆక్సిజన్ బెడ్లు, 500 ఐసీయూ బెడ్లు ఉంటాయి.

02



## నేను దోషిని కాదు

### ట్రంప్ అరెస్ట్ విడుదల

**ప్రజా తపన ,న్యూయార్క్:**

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం మరోసారి మియామిలోని ఫెడరల్ కోర్టు ముందు హాజరయ్యారు. అధ్యక్షుడిగా దిగిపోయిన తర్వాత అధికారిక రహస్యాలున్న పత్రాలను వెంట తీసుకెళ్లాడని అభియోగాలను ఎదుర్కొన్నారు. తన ఇంట్లో ఆ పత్రాలను దాచిపెట్టుకున్నారనే ఆరోపణలపై ట్రంప్ పై కేసు నమోదైంది. లాంఛనంగా అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో ట్రంప్‌ను హాజరుపరిచారు. దీంతో అమెరికా చరిత్రలోనే నేరారోపణలు ఎదుర్కొంటూ కోర్టుకు హాజరైన తొలి మాజీ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ నిలిచిపోయారు. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో ట్రంప్ నిబంధనలకు విరుద్ధంగా అధికారిక రహస్య పత్రాలను దాచారని అభియోగాలను ట్రంప్ తిరస్కరించారు. ఈ కేసులో ట్రంప్ అరెస్టుకు ఆదేశాలు వెలువడతాయనే ప్రచారం జరిగింది.

02

## మణిపూర్ హింసలో 9 మంది మృతి



**ప్రజా తపన ,ఇంఫాల్ :**

మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు ఆగడం లేదు. కేంద్ర సాయుధ బలగాలతో పాటు పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితులు అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నా అది సాధ్యం కావడం లేదు. గత 24 గంటల్లో

02

## తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్ట్

**ప్రజా తపన ,చెన్నై:**



తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్ నివాసాలపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ బుధవారం ఉదయం నుంచి దాడులు నిర్వహించింది. దాదాపు 17 గంటల పాటు ఈ సోదాలు జరిగాయి. అనంతరం తెల్లవారుజామున 2 గంటల సమయంలో వారిని చెన్నై నుంగంబాక్కంలోని ఈడీ కార్యాలయానికి తరలించారు. సెంథిల్ బాలాజీని విచారణ కోసం

02

## బిపర్‌జాయ్ తుఫాన్ ఉగ్రరూపం



02

## నేల తల్లిని ముద్దాడిన నారా లోకేష్

**జన సంద్రంగా మారిన యువ గళం**

**పాదయాత్ర**

**ప్రజా తపన ,ఆత్మకూరు**



నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతంలో యువ గళం నారా లోకేష్ బాబు పాదయాత్ర నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది. కడప జిల్లా బద్వేలు నియోజకవర్గం నుండి ఆత్మకూరు నియోజకవర్గం లోకి అడుగుపెట్టిన క్రమంలో మా తుఝే సలాం అంటూ నెల్లూరు జిల్లా సరిహద్దు నేలను నారా లోకేష్ బాబు ముద్దాడి తన పాదయాత్రను ప్రారంభించారు. బద్వేలు

02

# వైద్యానికి మానవ జీవితానికి ఎడతెగని సంబంధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక గది కావాలనుకునే రోగుల కోసం కొత్తగా 300 పేయింగ్ రూమ్స్ కేటాయిస్తారు. ప్రస్తుతం 30 విభాగాలు ఉండగా.. విస్తరణతో వీటి సంఖ్య 35 కానుంది. నిమ్స్‌కు కేసీఆర్ ప్రభుత్వం 2014-15లో 185 కోట్లు కేటాయించారు. తర్వాత 2022లో 242 కోట్ల రూపాయల నిధులు ఇచ్చారు. ప్రస్తుత ఏడాది రూ.290 కోట్లు కేటాయించారు. 2014 నాటికి నిమ్స్‌లో 900 పడకలు మాత్రమే ఉండేవి. తర్వాత ఆ సంఖ్యను ప్రభుత్వం 1489కి పెంచింది. ఇప్పుడు మరో 2000 పడకల నిర్మాణానికి పనులు ప్రారంభం అయ్యాయి. 2014 నాటికి 111 మంది మాత్రమే టీచింగ్ స్టాఫ్ ఉండే వాళ్లు. గతేడాది మరో 150ని నియమించారు. ఇప్పుడు అక్కడ బోధనా సిబ్బంది 264కు చేరింది. రెసిడెంట్ డాక్టర్ల కేటాయింపును కూడా పెంచారు. ప్రస్తుతం 169 మందిని కేటాయిస్తున్నారు. 2014 -2021 మధ్య నిమ్స్‌లో 90 కోట్ల రూపాయల విలువైన పరికరాలను కొనుగోలు చేశారు. 2022లో మరో రూ.153 కోట్ల పరికరాల కోసం ఆర్డర్ ఇచ్చారు. 2014తో పోల్చితే ఓపీ 26%, ఐపీ 91% పెరిగాయని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. నిమ్స్ ఆరోగ్యశ్రీ కింద లక్షన్నర మంది లబ్ధిపొందారు. 32 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, 6 మేజర్ మాడ్యులర్ థియేటర్లు దీనిలో నిర్మించనున్నారు. మొత్తం మూడు బ్లాకులలో నిమ్స్ టవర్ నిర్మించనున్నారు. శంకుస్థాపన అనంతరం సీఎం కేసీఆర్ మాట్లాడుతూ..వైద్యానికి, మానవజీవితానికి ఎడతెగని బంధం ఉన్నట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కరోనాను మించిన వైరస్ వచ్చే అవకాశముందని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వివరించారు.మానవజాతి ఉన్నన్ని రోజులు వైద్య రంగం ఉండాల్సిందే.. 2014లో 2వేల కోట్ల బడ్జెట్ అయితే, 2023లో 12వేల కోట్లు వైద్యశాఖకు కేటాయింపులు జరిపినట్లు సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆక్సిజన్ కోసం కేంద్రాన్ని అడుక్కోకుండా ఆక్సిజన్ మనమే తయారు చేసుకుంటున్నామన్నారు. వందల పడకల ఆసుపత్రులను వేల సంఖ్యకు పెంచుకున్నామన్నారు. రాబోయే రోజుల్లో కరోనాను మించిన వైరస్ లు వస్తాయి.. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో ఎదురైనా ఎదురుకునేందుకు తెలంగాణ వైద్యశాఖ రెడీగా ఉందంటూ సీఎం స్పష్టంచేశారు. బెస్ట్ ప్లానింగ్ ఆఫ్ సక్సెస్ అనే నినాదం ఉన్నత వైద్యాధికారులు మర్చిపోవద్దంటూ కోరారు. వైద్యారోగ్య శాఖలో పీఆర్ తక్కువ అందుకే విమర్శలు వచ్చిపడుతున్నాయి. వైద్యోనారాయనో హరి అంటారు.. ఎయా లు అయినా ముఖ్యమంత్రి అయినా రోగం వస్తే డాక్టర్ దగ్గరకు వెళ్లాల్సిందే. పోలీస్ ప్రొఫైల్ ను పూర్తిగా మార్చి.. ఫ్రెండ్లీ పోలీస్ గా మార్చాము. వైద్యశాఖ ప్రజలకు చేసే సేవ ప్రజలకు తెలిసేలాగా పీఆర్ పెంచాలి. వైద్యారోగ్యశాఖ లో ప్లానింగ్ ఇంకా బాగా మెరుగ్గా ఉండాలంటూ సూచించారు. కొత్త భవనాలు, నూతన ఈక్విప్మెంట్ తేవడం కాదు అది ప్రజలకు ఉపయోగపడాలని.. కరోనా లాంటి మహమ్మారి మళ్ళీ వచ్చినా ప్రజలకు మేమున్నాం అనే ధైర్యం డాక్టర్లు ఇవ్వాలని పేర్కొన్నారు. డాక్టర్లు పనిచేయడం లేదనే విమర్శ ఉందని.. అది తొలిగిపోయేలా మీ పనితీరు మార్చుకోవాలంటూ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

# తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకెళ్లారా లేక అరెస్టు చేశారా అనే దానిపై సందిగ్ధత నెలకొనగా, ఆయనను అరెస్టు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. సెంథిల్ బాలాజీని అధికారులు తీసుకెళుతుండగా అకస్మాత్తుగా ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో ఆయనను ఒమందురార్ ప్రభుత్వాసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చేర్పించారు. ముందుజాగ్రత్తగా అక్కడ పారామిలటరీ బలగాలను మోహరించారు.నిన్న తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి వి.సెంథిల్ బాలాజీ ఇంటిపై ఈడీ దాడులు చేసిన తర్వాత ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ సహా పలువురు ప్రధాన ప్రతిపక్ష నేతలు ఈ దాడులను ఖండించారు. ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న ప్రభుత్వాల మంత్రులపై ఈడీ చర్యలు కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సెంథిల్ బాలాజీ కార్యాలయంపై దాడితో అప్రజాస్వామిక కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే నేతలే లక్ష్యంతో ఈడీ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలకు చేరువైందన్నారు. మంత్రి సెంథిల్ బాలాజీ సెక్రటేరియట్ కార్యాలయంపై ఈడీ దాడులు ఫెడరల్ వ్యవస్థపై ప్రత్యక్ష దాడి అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై బీజేపీ అనుసరిస్తున్న బ్యాక్ డోర్ వ్యూహం సత్ఫలితాలను ఇవ్వదు. బీజేపీ కక్షసాధింపు రాజకీయాలను గమనిస్తున్న ప్రజల మౌనాన్ని తక్కువ అంచనా వేయకూడదు. ఇది 2024 తుఫాను ముందు ఉన్న శాంతి తప్ప మరేమీ కాదని, ఇది బీజేపీని తుడిచేస్తుందని అన్నారు.తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి కార్యాలయం సోదాల్లో ఈడీని దుర్వినియోగం చేయడాన్ని తమ పార్టీ ఖండిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వం వేధింపులకు, బెదిరింపులకు చేస్తున్న ప్రయత్నాలు. రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం మోదీ ప్రభుత్వ లక్షణం. ప్రతిపక్షాలను అణగదొక్కడంలో ఈ ఎత్తుగడలు సఫలం కావు అని అన్నారు. ఈ ఘటనపై స్పందించిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ 'ప్రతిపక్షాలను వేధించడానికి, భయపెట్టడానికి బీజేపీ కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తోంది. తమిళనాడు విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీపై ఈడీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయ కక్షసాధింపు చర్యలతో బీజేపీ ప్రజాస్వామ్యానికి కోలుకోలేని నష్టం చేస్తోందన్నారు.తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఈ దాడులపై కేంద్రాన్ని టార్గెట్ చేశారు. డీఎంకేపై బీజేపీ చేస్తున్న రాజకీయ కక్షసాధింపు చర్యలను ఖండిస్తున్నామన్నారు. కేంద్ర సంస్థల దుర్వినియోగం యథేచ్ఛగా కొనసాగుతోంది. తమిళనాడు మంత్రి రాష్ట్ర సచివాలయం, ఆయన అధికారిక నివాసంపై ఈడీ దాడులు ఆమోదయోగ్యం కాదు. ఇది బీజేపీ హేయమైన చర్య అన్నారు.కరూర్ జిల్లాకు చెందిన డీఎంకే సీనియర్ నేత బాలాజీ మాట్లాడుతూ అధికారులు తన కార్యాలయానికి ఏం వెతుక్కుంటూ వచ్చారో తనకు తెలియదని అన్నారు. దర్యాప్తునకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖను కూడా ఆయనే నిర్వహిస్తున్నారు. గతంలో అన్నాడీఎంకేలో ఉన్న బాలాజీ దివంగత జయలలిత ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ ఏ) నిబంధనల ప్రకారం ఈడీ చర్యలు తీసుకుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం సెంథిల్ బాలాజీ నివాసాల్లో సోదాలు నిర్వహించింది. ఈరోడ్‌తో పాటు బాలాజీ సొంత జిల్లా కరూర్‌లో కూడా సోదాలు నిర్వహించారు. సచివాలయంలోని బాలాజీ కార్యాలయ గదిలో కూడా సోదాలు చేశారు. అనంతరం ఆయన్ని రాత్రి 2 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. గత నెలలో రాష్ట్రంలో బాలాజీకి సన్నిహితుల నివాసాల్లో కూడా ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించింది. గత నెలలో కరూర్ లోని బాలాజీకి సంబంధించిన కొన్ని ప్రాంతాల్లో తనిఖీలు చేసేందుకు వెళ్లిన ఆదాయపు పన్ను శాఖ అధికారులపై దాడి జరిగింది. అందుకే ఈసారి ఈడీ అధికారుల వెంట కేంద్ర పారామిలటరీ బలగాల సిబ్బంది ఉన్నారు.

# బిపర్‌జాయ్ తుఫాన్ ఉగ్రరూపం

**హైదరాబాద్ :**

బిపర్‌జాయ్ తుఫాన్ మరింత ఉగ్రరూపం దాల్చుతోంది. గుజరాత్ తీరం వైపు దూసుకొస్తూ అంతకంతకూ బలపడుతోంది. తుఫాన్ ధాటికి గుజరాత్ గజగజ వణికిపోతోంది. ఈ తుఫాన్.. గుజరాత్‌లోని జఖౌ వద్ద రేపు సాయంత్రం తీరం దాటనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ద్వారక, కచ్ ప్రాంతాల మధ్య 150 కిలోమీటర్ల వేగంతో తీరాన్ని తాకనున్నట్లు అంచనా వేస్తోంది. అదే జరిగితే ఆ ప్రాంతంలో విధ్వంసం ఖాయంగా కనిపిస్తుంది. బిపర్‌జాయ్ తుఫాన్ పశ్చిమ తీరంలో పెను విధ్వంసం సృష్టించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దాంతో.. తీర ప్రాంతాల్లో విపత్తు బృందాలను మోహరించారు. గుజరాత్, మహారాష్ట్రలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో లక్షా 30 వేల మందిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాన్‌పై గుజరాత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. మత్స్యకార గ్రామాలను ఖాళీ చేయించి.. సముద్రంలోకి వెళ్లకూడదని సూచించింది. తీర ప్రాంతాలకు చెందిన 30 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, తుఫాన్ కారణంగా 69 రైళ్లు రద్దయ్యాయి. మరో 58రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు పశ్చిమ రైల్వే తెలిపింది.తుఫాన్ ప్రభావంతో గుజరాత్, కేరళ, కర్నాటక, గోవా, మహారాష్ట్రల్లోని తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంటకు 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. ప్రధానంగా.. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. అయితే.. తుఫాన్ తీరానికి సమీపిస్తోన్న కొద్దీ తీవ్రత పెరుగుతోంది. అయితే, తీర ప్రాంతాల్లో వారిని ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించామని.. సహాయక చర్యల కోసం సైన్యాన్ని కూడా రంగంలోకి దించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.బిపర్‌జాయ్ తుఫాన్‌పై అత్యవసర సమీక్ష నిర్వహించారు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా. తుఫాన్‌పై ఇప్పటికే రాష్ట్రాలను అప్రమత్తం చేశామన్నారు అమిత్‌షా. సహాయక చర్యల కోసం ఔఆఖీఈ , ూఆఖీఈ బృందాలను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. అటు.. గుజరాత్‌లోని తుఫాన్ పరిస్థితిని కేంద్ర ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తీరప్రాంతాల్లో పర్యటించి సహాయక సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

# నేల తల్లిని ముద్దాడిన నారా లోకేష్

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గంలో పాదయాత్రకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆనం రామనారా యణ రెడ్డి తనయురాలు కైవల్య రెడ్డి చేతుల మీదుగా పాదయాత్రను ఆనం రామ నారాయణ రెడ్డి స్వీకరించడం జరిగింది. పెన్నా నది పరవళ్ళు తొక్కినట్టు జిల్లా నలుమూలల నుండి నాయకులు కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతాన్ని జనసంద్రంగా మార్చారు. నారా లోకేష్ బాబుని చూడడానికి తరలివచ్చిన జనానికి నిరాశ మిగిల్చారు. అనుకున్న దానికంటే మించి జనాలు రావడంతో ఒక దశలో నాయకులు సైతం తోపులాటకు గురయ్యారు నియంత్రణ కోల్పోయే స్థితి చేరుకోవడంతో నారా లోకేష్ బాబుని చూసే అవకాశాన్ని తెలుగుదేశం పార్టీ అభిమానులు, ప్రజలు కోల్పోవాల్సి వచ్చింది. నెల్లూరు జిల్లా మర్రిపాడు,అనంతసాగరం మడలాల్లో మూడు రోజుల పాటు సాగే పాదయాత్రలో పదహారు వందల కిలోమీటర్ల మైలు రాయిని దాటే క్రమంలో చుంచులూరు గ్రామంలో శిలా ఫలకాన్ని ఏర్పాటు చేయనున్నారు. గ్రామస్తులతో నారా లోకేష్ బాబు ముఖాముఖిగా మాట్లాడి ఆ ప్రాంత సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా తన కార్యచరణను రూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం. అనంతసాగరంలో జరిగే బహిరంగ సభ అనంతరం వెంకటగిరి నియోజకవర్గంలోనికి యువ గళం పాదయాత్ర ప్రవేశించడానికి పూర్తి ఏర్పాటు ఇవ్వగలం పాదయాత్ర నిర్వాహకులు ఆనం రామ నారాయణరెడ్డి తెలియజేశారు.

# వినతుల పరిష్కారంలో క్వాలిటీ ముఖ్యం

(మొదటిపేజీ తరువాయి)

నాటికి సాగు నీరు విడుదల, ఖరీఫ్ కు ప్రారంభం నాటికి సీడ్స్, ఎరువులు పెస్టిసైడ్స్, సిద్ధపరచుకోవడం, పర్యవేక్షణ టీం ఏర్పాటు చేసి నాణ్యతను పర్యవేక్షించడం వీటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ, రైతు పంట రుణాలు సంబంధించి కలెక్టర్లు బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు గురించి మాట్లాడారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష పథకం, స్టోన్ ప్లాంటేషన్ ల్యాండ్ సర్వే రికార్డ్స్, ఆధార్ సీలింగ్ ల్యాండ్ కన్వర్షన్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు

# మణిపూర్ హింసలో 9 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)



జరిగిన అల్లర్లలో దాదాపు 9 మంది ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు వెల్లడించారు. మృతుల్లో ఓ మహిళ కూడా ఉంది. ఖమేన్‌లోక్ ఏరియాలో అర్ధరాత్రి పూట ఉన్నట్టుండి ఫైరింగ్ జరిగింది. 9 మంది అక్కడికక్కడే చనిపోగా...కొందరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ వారి శరీరాలపై లోతైన గాయాలున్నట్టు వైద్యులు వెల్లడించారు. బులెట్ గాయాలు కూడా ఉన్నట్టు తెలిపారు. దాదాపు నెల రోజులుగా గిరిజన, గిరిజనేతర వర్గాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ ఘటనతో మరోసారి కర్ఫ్యూ విధించారు పోలీసులు. పలు చోట్ల కఠిన ఆంక్షలు విధించారు. ఇంఫాల్, కంగ్‌పోక్పి సరిహద్దులోని ఖమేన్‌లోక్‌లో హింస చెలరేగుతోంది. దాదాపు రెండు రోజులుగా ఇక్కడి వాతావరణం వేడిగానే ఉంది. ఇప్పటి వరకూ మణిపూర్‌లోని హింసాత్మక ఘటనల కారణంగా దాదాపు 100 మంది చనిపోయినట్టు అంచనా. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవల్ని బంద్ చేశారు. కొన్ని చోట్ల ఆందోళనకారులు వాహనాలకు నిప్పు పెడుతున్నారు. ఇళ్లపై దారుణంగా దాడులు చేస్తున్నారు. ఒకరినొకరు కాల్చుకుంటున్నారు. ఎక్కడ చూసినా భయానక వాతావరణమే కనిపిస్తోంది.అటు కేంద్రమంత్రి అమిత్‌షా ఎప్పటికప్పుడు ఇక్కడి పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ...మణిపూర్ సీఎం బైరెన్ సింగ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసపై పూర్తి స్థాయిలో ఓ రిపోర్ట్ తయారు చేసి అమిత్‌షాకి పంపుతానని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 349 రిలీఫ్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ 4,537 ఆయుధాలను దొంగిలించారు ఆందోళకారులు. వీటిలో 990 ఆయుధాలను పోలీసులు రికవర్ చేసుకున్నారు. శాంతి భద్రతలు కాపాడేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పోలీసులతో పాటు భద్రతా బలగాలూ నిఘా పెడుతున్నాయి. జాయింట్ కూంబింగ్ ఆపరేషన్ చేపడుతున్నాయి. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మణిపూర్ పర్యటనకు వెళ్లి అక్కడి అధికారులతో కీలక సమావేశాలు నిర్వహించారు. పరిస్థితులు సమీక్షించారు. ఈ క్రమంలోనే పూర్తి స్థాయిలో విచారణ జరిపేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. హైకోర్ట్ రిటైర్డ్ జడ్జ్ నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

# నేను దోషిని కాదు

(మొదటిపేజీ తరువాయి)

అయితే ఎలాంటి షరతులు లేకుండానే ఆయన కోర్టు నుంచి బయటకు వెళ్లిపోయారు. ట్రంప్? కోర్టు నుంచి బయటకు వచ్చిన తరువాత ఒక క్యూబన్? రెస్టారెంట్?లో తన మద్దతుదారులతో కలిసి సరదాగా గడిపారు ట్రంప్.జనవరి 2021లో ట్రంప్ వైట్‌హౌస్‌ను విడిచిపెట్టినప్పుడు.. పెంటగాన్, అఎం, నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ, ఇతర ఇంటెలిజెన్స్ బాడీల నుంచి అత్యంత సున్నితమైన సమాచారాన్ని కలిగి ఉన్న రహస్య ఫైళ్లను తన వెంట తీసుకెళ్లాడని న్యాయ శాఖ పేర్కొంది. స్కై న్యూస్ ప్రకారం, ట్రంప్ ఇంటెలిజెన్స్ సమాచారంతో కూడిన పత్రాలను షవర్, బాత్రూమ్‌లో ఉంచారు.పత్రాల బాక్సులను తన మార్-ఎ-లాగో ఎస్టేట్‌కు తరలించడంలో ట్రంప్ స్వయంగా పాల్గొన్నారని ఆరోపణలు వచ్చాయి. అంతర్జాతీయ మీడియా సంస్థలు అందించిన సమాచారం ప్రకారం, ట్రంప్ నివాసం నుండి ఈఃఎ స్వాధీనం చేసుకున్న అత్యంత రహస్య రికార్డులలో విదేశీ దేశం అణు సామర్థ్యాల వివరాలు ఉన్నాయి.జూన్ 10న ఫ్లోరిడాలోని ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన నేరారోపణ ప్రకారం, ట్రంప్ తన మార్-ఎ-లాగో నివాసం, క్లబ్‌లో పత్రాలను సురక్షితంగా ఉంచలేదు. ఇది క్రమం తప్పకుండా వేలాది మంది అతిథులను ఈవెంట్‌లకు ఆతిథ్యం ఇస్తుంది. పత్రాలను అనధికారికంగా బహిర్గతం చేయడం వల్ల అమెరికా జాతీయ భద్రత ప్రమాదంలో పడుతుందని ఆరోపణలు పేర్కొన్నాయి.బైడన్ కు భయం పట్టుకుందిఅమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్...బైడెన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. "జో బైడెన్ పెద్ద అవినీతి పరుడు" అంటూ విమర్శించారు. అమెరికా చరిత్రలోనే అధ్యక్షుడి పదవిని ఇంతలా దుర్వినియోగ పరుస్తున్న నేత ఇంకెవరూ లేరని మండి పడ్డారు. సీక్రెట్ డాక్యుమెంట్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రంప్...ఇలాంటి కామెంట్స్ చేయడం కీలకంగా మారింది. తనపై కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై న్యాయపోరాటం కూడా మొదలు పెట్టారు. మియామిలోని ఫెడరల్ కోర్టులో తనపై వచ్చిన ఆరోపణలకు వ్యతిరేకంగా పిటిషన్ వేశారు. వచ్చే ఏడాది నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ రేసులో తాను కూడా ఉన్నట్టు ఇప్పటికే ప్రకటించారు ట్రంప్. ప్రెసిడెంట్ పదవికి పోటీ పడుతున్న ట్రంప్‌ని చిక్కులు వెంటాడుతున్నాయి. వరసగా ఏదో ఓ కేసులో ఇరుక్కుంటున్నారు. "అధికారాన్ని ఏ స్థాయిలో దుర్వినియోగం చేస్తున్నారో చెప్పడానికి ఇదే ఉదాహరణ. అమెరికా చరిత్రకే ఇది కళంకం తెచ్చి పెట్టింది. ఎంతో బాధగా ఉంది. అవినీతి పరుడైన వ్యక్తి (బైడెన్‌ని ఉద్దేశిస్తూ) అధ్యక్ష పదవిలో ఉన్నారు. రాజకీయ ప్రత్యర్థినైన నాపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఓడిపోతాననే భయం పట్టుకుంది. అందుకే ఇలా నాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఇంత కన్నా దారుణంగా ఇంకేదీ ఉండదు"ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రంప్ న్యాయపోరాటం చేయగా...విదేశీ పర్యటనలపై ఉన్న ఆంక్షలు తొలగించింది ఫెడరల్ కోర్టు. అయితే...ఈ కేసుల్లో సాక్షులుగా ఉన్న వారితో ఎలాంటి కమ్యూనికేషన్ ఉండకూడదని తేల్చి చెప్పింది. ఈ వ్యాఖ్యలు చేయగానే...కోర్టులోని ట్రంప్ మద్దతుదారులంతా "చివ ఒనీలవ ఎతీబీఎజూ" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ చుట్టూ మరో ఉచ్చు బిగుస్తోంది. నేషనల్ సెక్యూరిటీకి సంబంధించిన కీలక డాక్యుమెంట్స్‌ని ట్రంప్ తన వద్దే అనధికారికంగా వాటిని దాచి పెట్టుకున్నాడన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఇప్పటికే ఆయనపై కేసు నమోదైంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన తరవాత వైట్‌హౌజ్‌ని ఖాళీ చేసి వెళ్లే సమయంలో కొన్ని కీలక పత్రాలను ట్రంప్ తనతో పాటు తీసుకెళ్లాడన్నది ప్రధాన ఆరోపణ. ఫ్లోరిడాలోని మార్ ఏ లాగో రిసార్ట్‌లో వాటిని దాచి పెట్టినట్టు అక్కడి మీడియా వెల్లడించింది. ఇదే విషయాన్ని స్వయంగా ట్రంప్ వెల్లడించారు. తనపై కేసులు పెట్టినట్టు చెప్పారు. అధికారులు ఇప్పటికే ఆయన రిసార్ట్‌లో సోదాలు నిర్వహించారు. కొన్ని కీలక పత్రాలు దొరికాయి. వాటిని వైట్‌హౌజ్‌కి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ట్రంప్ అడ్డుకున్నారని పోలీసులు వెల్లడించారు. అయితే...ట్రంప్ మాత్రం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. మియామి ఫెడరల్ కోర్టులో హాజరు కావాలని తనకు సమన్లు జారీ చేశారని చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షుడిపై ఇలాంటి ఆరోపణలు వస్తాయని ఎప్పుడూ అనుకోలేదని ట్రంప్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేశారు.

# భానుడి భగభగలు

**కడప :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ.. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల వర్షాలు కురుస్తున్నప్పటికీ.. మరికొన్ని చోట్ల ఎండలు మాత్రం తగ్గేదేలే అంటూ మాడు పగలగొడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి డా.బిఆర్ అంబేద్కర్ బుధవారం తెలిపారు. రేపు 188 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 195 మండలాల్లో వడగాల్పులు, ఎల్లుండి 23 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 248 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఏపీలో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో 45లీఅ, ప్రకాశం జిల్లా జువ్విగుంటలో 44.9లీఅ, కాకినాడ జిల్లా సీతంపేటలో 44.7లీఅ, పల్నాడు జిల్లా రవిపాడులో 44.3లీఅ అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. బాపట్ల-43, ఒంగోలు-43, నందిగామ-42, మచిలీపట్నం -42, కాకినాడ-42, అమరావతి-42, గన్నవరం-42, నెల్లూరు-42, నంద్యాల-41, తిరుపతి-41, నర్సాపురం-41, కడప-41, కర్నూలు-39, అనంతపురం-39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే 112 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 220 మండలాల్లో వడగాల్పులు వీచాయన్నారు.ఎండ తీవ్రతకు జనం ఇళ్ల నుంచి బయటికిరావడం లేదు. వ్యాపారులు షాపులు కూడా తెరవడం లేదు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రయాణాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దీంతోపాటు అక్కడక్కడ ఈదురగాలులతో వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే కూలీలు, పుశు-గొర్రె కాపరులు చెట్ల క్రింద ఉండరాదన్నారు.

# బీజేపీలో వైసీపీ, టీడీపీల మధ్య ఆట

**నెల్లూరు :**

ఏపీ ప్రభుత్వంపై బీజేపీ నేతల మాటల దాడి మొదలు పెట్టారు. నాలుగేళ్లుగా ఏపీ ప్రభుత్వంపై ఈగ వాలకుండా చూసుకున్న బీజేపీ తీరు మారడానికి కారణం ఏమిటనే చర్చ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతోంది. మొన్న బీజేపీ జాతీయాధ్యక్షుడు నడ్డా, నిన్న అమిత్ షా ఏపీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని నేరుగా టార్గెట్ చేశారు. విపక్షాలన్నీ ఒక్కటవుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో బీజేపీ అగ్రనేతల మాటల దాడికి కారణం ఏమిటనే ఆసక్తి అందరిలోను ఉంది.ఏపీలో ఎన్నికలకు ఏడాది మాత్రమే సమయం ఉండటంతో పార్టీల మధ్య లెక్కలు మారిపోతున్నాయి. గత నెలలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అమిత్‌షా, నడ్డాలతో భేటీ అయ్యారు. ఆయన భేటీలో ఏమి జరిగిందనేది బయటకు రాలేదు. పొత్తుల కోసమే ప్రాథమిక చర్చ జరిగిందని ప్రచారం జరిగినా బీజేపీ కానీ టీడీపీ కానీ దానిని ధృవీకరించలేదు. బాబు భేటీ పొత్తు కోసం కాదని కూడా మరో వర్గం చెప్పుకొచ్చింది.పొత్తుల లెక్కలు ఇప్పుడే తేలకపోయినా ఏపీలో పాగా వేయాలనే బీజేపీ ప్రయత్నాలు మాత్రం నాలుగేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంది. 2019ఎన్నికల్లో ఓటమి తర్వాత టీడీపీలో ఉన్న పారిశ్రామికవేత్తలు పార్టీ ఫిరాయించేశారు. టీడీపీలో ఉంటే తమకు చిక్కులు తప్పవనే క్లారిటీతోనే వారు బీజేపీ గూటికి చేరిపోయారు. ఆ తర్వాత వారి రాజ్యసభ పదవీ కాలం ముగిసిన తర్వాత ఒక్కరికి కూడా మళ్లీ పదవి దక్కలేదు.మరోవైపు టీడీపీని కోలుకోకుండా దెబ్బ కొట్టాలని భావించిన బీజేపీ ఆశలు కూడా నెరవేరలేదు. సంస్థాగతంగా బలంగా ఉన్న బీజేపీ నాయకుల్ని పార్టీలో చేర్చుకోవడం ద్వారా బలపడాలని బీజేపీ భావించింది. ఏపీలో బీజేపీకి క్షేత్ర స్థాయిలో బలమైన క్యాడర్ లేకపోవడం, ప్రజలు సామాజిక వర్గాలు, పార్టీల వారీగా ఓటర్లుగా చీలిపోవడంతో బీజేపీ బలం పెంచుకోవడం కష్టమైపోయింది.మరోవైపు నాలుగేళ్లుగా ఏపీలో వైఎస్సార్సీపీకి బీజేపీ లోపాయికారీ సహకారం అందిస్తూనే ఉంది. ప్రభుత్వ మనుగడకు కావాల్సిన సహకారం, రుణాలకు అవసరమైన అనుమతుల విషయంలో ఇతర రాష్ట్రాలకు లేని విధంగా కేంద్రం నుంచి ఏపీకి ఊరట లభించింది.ఏపీలో వైసీపీ నేతృత్వంలోని ప్రాంతీయ పార్టీ ప్రభుత్వం బీజేపీ కనుసన్నల్లోనే ఉన్నా బీజేపీ సొంతంగా ఎదిగే అవకాశాలు మాత్రం దానికి కనుచూపుమేరలో కనిపించడం లేదు. బీజేపీ ఎదగకపోవడానికి రెండు ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండటమే కారణమనే భావనకు బీజేపీ రావడంతోనే దీర్ఘకాలిక వ్యూహాన్ని అనుసరించడానికి సిద్దమైనట్లు కనిపిస్తోంది. ఎన్నికలలు మరో ఏడాదిలో జరుగనుండటంతో ఒంటరిగా పోరులోకి దిగితే పెద్దగా ఫలితం ఉండదని భావిస్తోంది.2014లో మాదిరి టీడీపీ, జనసేనతో కలిసి వెళ్లాలనే విషయంలో నిర్ణయం తీసుకోకపోయినా అందుకు అవకాశాలు లేకపోలేదు. బీజేపీకి కనీసం రెండు మూడు ఎంపీ స్థానాలైనా దక్కుతాయని ఆ పార్టీ భావిస్తోంది. 2024 ఎన్నికల్లో ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వాటి మద్దతు కేంద్రంలో తమకే దక్కేలా ఇప్పటికే పావులు కదుపుతోంది. 2024 ఎన్నికల తర్వాత వైసీపీ, టీడీపీలతో వ్యవహారాన్ని సెటిల్ చేసుకోవాలనే ప్లాన్ కూడా ఆ పార్టీకి ఉండే అవకాశం ఉంది.ఏపీలో టీడీపీతో కలిసి పోటీ చేసే విషయంలో గతంలో చేసిన వ్యాఖ్యలకు ఆ పార్టీ ఇప్పుడు వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం కూడా ఉంది. టీడీపీతో మళ్లీ జట్టు కట్టే ప్రసక్తి ఉండదని గతంలో పలు సందర్భాల్లో అమిత్ సా స్పష్టం చేశారు. తాజా రాజకీయ పరిస్థితుల్లో బీజేపీకి మిత్రపక్షాల బలం అనివార్యంగా అవసరం అవుతోంది. సొంతంగా పోటీ చేయలేని పరిస్థితుల్లో మిత్రులతో కలిసి సాగడం మేలనే భావన ఆ పార్టీ నేతలకు వచ్చి ఉండొచ్చు.మరోవైపు ఏపీలో అధికార పార్టీ టార్గెట్ మొత్తం టీడీపీ లక్ష్యంగానే సాగుతోంది. రాజకీయ వైరుధ్యాలు రెండు పార్టీల మధ్యే సాగుతుండటంతో మూడో పక్షానికి అవకాశం లేకుండా పోతోంది. ఏపీలో బీజేపీ ప్రభావం కనిపించకుండా పోటీ రెండు పార్టీల మధ్యే ఉండటంపై కూడా బీజేపీలో అనుమానాలు ఉన్నాయి. బీజేపీని ఎదగనివ్వకుండా వైసీపీ, టీడీపీల మధ్య ఆట నడుస్తోందని ఆ పార్టీ నేతలు అనుమానిస్తున్నారు. వీటన్నింటికి ఇప్పటికిప్పుడు చెక్ పెట్టే పరిస్థితి లేకపోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలతో కార్యాచరణ మొదలు పెట్టినట్టు కనిపిస్తోంది.ఎన్నికల నాటికి వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో దాడి చేయడానికి అవినీతి ఆరోపణల్ని ఆ పార్టీ అస్త్రంగా చేసుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి

# జంబో కార్యవర్గం....

**హైదరాబాద్ :**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గాన్ని భారీగా విస్తరించారు బండి సంజయ్. ఒక్కరో ఇద్దరో కాదు.. ఏకంగా 125 మందికి చోటిచ్చారు. అంతేకాదు.. మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మేయర్‌లు, జడ్పీ ఛైర్మన్లతో సహా రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లంతా రాష్ట్రకార్యవర్గ సమావేశాలకు స్పెషల్ ఇన్వైటీస్ అని ప్రకటించారు బండి సంజయ్. ఇదే ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.ఓ వైపు అధ్యక్షుడి మార్పు అంటూ వార్తలు వెల్లువెత్తుతున్నాయి. బండి సంజయ్ స్థానంలో ఈటల రాజేందర్‌కు బాధ్యతలు అప్పగిస్తారన్న వార్తలు గుప్పుమన్నాయి. మరోవైపు ఈటలకు వ్యతిరేకంగా పార్టీ బ్యాక్‌గ్రౌండ్‌లో కథ నడుస్తోందన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈలోగా బండి సంజయ్ తన మార్కు జంబో కమిటీని ప్రకటించేశారు. ఆశావహులందరినీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీలో చేర్చేశారు బండి సంజయ్. బండి సంజయ్ జంబో కమిటీ వెనుక అసలు మతలబు ఏమిటన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ కు, చేరికల కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ ఉప్పునిప్పుగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ లక్ష్మణ్ సైలెంట్ గా ఉండిపోయారు. అధ్యక్ష మార్పు లేదంటూ సంకేతాలు ఇవ్వడానికే సంజయ్ రాష్ట్ర కార్యవర్గాన్ని 125 మందితో విస్తరించారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఆఫీస్ బేరర్స్‌లోగానీ.. ఇతర పదవుల్లోగానీ ప్రత్యేకంగా ఎవరినీ నియమించకపోయినా.. పార్టీ రాష్ట్రకమిటీలో భారీ విస్తరణపై పెదవి విరుస్తున్నారు సీనియర్లు. పార్టీలోని పలువురు నేతలు తమకు సముచిత గౌరవం దక్కలేదని భావిస్తున్నట్టు తెలుస్తోంది.హైదరాబాద్ లో అమిత్‌షా పర్యటనకు రెండు రోజుల ముందు ఈ మార్పు ఎటువైపు దారితీస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. మరో వైపు పార్టీలో గ్రూపులుగా విడిపోయి సమావేశాలు నిర్వహించుకోవడంపై పార్టీ జాతీయ నాయకత్వం సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై అమిత్ షా ఏవిధంగా స్పందిస్తారనేది ఇప్పుడు కాషాయ పార్టీ నేతల్లో హై టెన్షన్ క్రియేట్ చేస్తోంది.

# పొత్తులపై... క్లారిటీ వచ్చేసినట్టేనా

**హైదరాబాద్ :**

బీజేపీ, తెలుగుదేశం పొత్తులు దాదాపు ఖరారు అయినట్లే! ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వవని ముందు నుంచి చెబుతున్న జనసేన ఈ సంకీర్ణంలో భాగస్వామిగా ఉంటుంది. భాజపా కాన్సన్‌ట్రేషన్ అంతా పార్లమెంట్ స్థానాల మీద ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వస్తామన్న నమ్మకం ఆ పార్టీ నాయకులకు లేదు. జిల్లా స్థాయిలో చెప్పుకోదగ్గ నాయకులే లేని పార్టీ ఆంధ్రను దక్కించుకుంటామనే సొంత కార్యకర్తలే నమ్మరు. కర్నాటక ఎన్నికల్లో అధికారం దక్కించుకుంటే భాజపా గేమ్ ప్లాన్ మరోలా ఉండేది. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని వాళ్లు కాన్ఫిడెంట్‌గా చెప్పలేకపోతున్నారు. విశాఖపట్నంలో జరిగిన బహిరంగ సభలో అమిత్‌షా ఈ సారి మూడు వందల స్థానాలు సాధిస్తామని చెబుతున్నారు. అంటే 2019 స్థాయిలో కూడా సీట్లు గెలవలేమని ఆయనకు అర్థం అయినట్లుంది.ఐదు రాష్ట్రాల ఎన్నికలే కీలకం ఈ ఏడాది హిందీ హార్ట్‌ల్యాండ్‌తో పాటు తెలంగాణతో కలిపి 5 రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. వాటి ప్రభావం లోక్‌సభ ఎన్నికల మీద ఖచ్చితంగా పడుతుంది. రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు కానీ అధికారంలోకి వస్తే బీజేపీ లోక్‌సభ సీట్లకు భారీగా గండి పడుతుంది. మోదీ ఛరిష్మా ఇంకా ఎంతకాలం పని చేస్తుందో చెప్పలేం. పదేళ్లు అయిన తర్వాత ప్రభుత్వ వ్యతిరేకత పెరుగడం సహజం. ఇక హిందుత్వవాదం, అయోధ్యలో రామాలయ నిర్మాణం, అవినీతి రహిత పాలన ఇలాంటివన్నీ బీజేపీకి కేంద్రంలో అధికారాన్ని సాధించిపెట్టకపోవచ్చు. ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోదీ దాదాపు 20 ర్యాలీలు, 6 రోడ్ షోలలో పాల్గొన్నారు. అయినా ఆ పార్టీ ఓటమి మూటగట్టుకుంది. అన్ని అభివృద్ధి పనుల్లో భాజపా 'నలభై శాతం' కమిషన్ తీసుకుంటుందని ఆరోపణలు రావడం, స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే విరూపాక్షప్ప కొడుకు నలభై లక్షల కమిషన్ తీసుకుంటూ దొరికిపోవడం కూడా భాజపాకు మైనస్ అయింది. అవినీతి ఒక్కటే ప్రధానాంశం కాదు. ప్రస్తుత డిప్యూట్ సీఎం డి.శివకుమార్ మీద అవినీతి ఆరోపణలపై సీబీఐ, ఈడీ కేసులు ఉన్నాయి. అధికారం కోసం ఎందాకా అయినా తెగించడం, పదేళ్ల పాటు ఏకధాటిగా పాలించడం వల్ల మూట కట్టుకున్న అవినీతి కమలం పార్టీ ఓటమికి ప్రధాన కారణాలు ఈ ఓటమి ఓ గుణపాఠం కాంగ్రెస్ చేతిలో ఓడిపోయిన నేపథ్యంలో భాజపాకు భయం మొదలైంది. అందివచ్చే ప్రతి అవకాశాన్ని వాడుకోవాలని అనుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వస్తామని ఆశ ఆ పార్టీకి లేకపోయినా, తెలంగాణ మాత్రం అందని ద్రాక్షలా ఊరిస్తోంది. కర్నాటకలో కాంగ్రెస్ పునరుజ్జీవం హస్తం పార్టీలో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. ఒక్కసారిగా రాహుల్, ప్రియాంక యాక్టివ్ అయ్యారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌లో పొత్తులపై ఎలాంటి ప్రకటనలూ చేయకపోయినా అధికార పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు బీజేపీ పెద్దలు. రెండు రోజుల తీవ్ర ఆరోపణల తర్వాత జగన్మోహన్‌రెడ్డి కూడా స్పందించారు. బీజేపీ మద్దతు తనకు లేకపోయినా ఫర్వాలేదని సోమవారం విద్యాకానుక కార్యక్రమంలో కుండబద్దలు కొట్టారు. ఆంధ్రప్రదేశ్‌కి ఇటీవల విభజన లోటు కింద పదివేల కోట్లు, పోలవరం ఖర్చుల రీఇంబర్స్‌మెంట్ కింద 13 వేల కోట్ల రూపాయలను కేంద్రం విడుదల చేసింది. భాజపా సంకీర్ణం రాబోయే రోజుల్లో నిధుల విడుదలను ఖచ్చితంగా తన ప్రచారంలో వాడుకుంటుంది. దేశంలో చాలావరకు పార్టీలన్నీ వారసత్వ రాజకీయాలతో కునారిల్లుతున్నాయి. బీజేపీ సంస్థాగతంగా చాలా బలంగా ఉంటుంది. 1984లో కేవలం 2 లోక్‌సభ సీట్ల నుంచి 303 సీట్లు సాధించి స్వయంగా అధికారం చేపట్టే స్థాయికి ఎదిగింది. ఆరెస్సెస్ లాంటి సిద్ధాంతకర్తలతో పాటు బీజేపీ వ్యూహాలు దీనికి ఉపకరించాయి. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలన్నీ ఓ కూటమిగా మారినా, అధికారం సాధిస్తామన్న ఆశ వాటికి లేదు. బీజేపీకి కూడా మ్యాజిక్ ఫిగర్ (273 లోక్‌సభ సీట్లు) వస్తుందన్న ధీమా లేదు. అందువల్లే తెలుగుదేశంతో పొత్తుకు భాజపా సిద్ధమైంది. 2019లో తమని ఇష్టం వచ్చినట్లుగా తిట్టిన చంద్రబాబును ఇంతవరకూ కన్నెత్తి చూడని కమలనాథులు, వ్యూహం మార్చారు. రెండు పడవల మీద ప్రయాణం మొదలు పెట్టారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ఎక్కువ సీట్లు గెలిస్తే, ఆ పార్టీతో ప్రయాణం కొనసాగుతుంది. అదే జగన్ ఎక్కువ ఎంపీ స్థానాలు గెలిస్తే వైకాపా సహాయం తీసుకోవచ్చు. దానికోసం సామ, దాన, భేద, దండోపాయాలను ఉపయోగించవచ్చు. సిబిఐ, ఈడీ ఉండనే ఉన్నాయి. గోల్ కొట్టేది ఎవరో అందుకే మొన్నటి వరకూ జగన్ ప్రభుత్వంతో స్నేహంగా ఉన్న ఢిల్లీ పెద్దలు ఇప్పుడు వైపాకాపై విమర్మల దాటి మొదలు పెట్టారు. అవన్నీ గత నాలుగేళ్లుగా ప్రతిపక్షాలు, పత్రికలు చేస్తున్న ఆరోపణలే. జగన్ మాత్రం కేంద్రంపై వ్యక్తిగత విమర్శలకు దిగడం లేదు. అలా 2019లో బీజేపీని నోటికొచ్చినట్లు తిట్టిన చంద్రబాబు తర్వాత వాళ్ల ప్రాపకం కోసం ఎంతలా తపించారో అందరికీ తెలుసు. అందుకే జగన్ కూడా బీజేపీతో సాఫ్ట్ గానే ఉంటున్నారు. బీజేపీ విమర్శలు పెరిగితే వైకాపా రాష్ట్రస్థాయి నాయకులు, మంత్రులు రంగంలోకి దిగుతారు. తీవ్ర విమర్శలు చేస్తారు. జగన్ చేతికి మట్టి అంటదు. 2024 ఎన్నికల్లో తాను ఖచ్చితంగా గెలుస్తాననే నమ్మకంతో జగన్ ఉన్నారు. అందుకే కేంద్ర పెద్దలతో, జాతీయ పార్టీలతో పంచాయతీలకు ఆయన సిద్ధంగా లేరు. ఇలా ఎవరి గేమ్ వాళ్లు ఆడుతున్నారు. చివరకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో గోల్ కొట్టేదెవరో వచ్చే ఏడాది జరిగే ఎన్నికలు నిర్ణయిస్తాయి.

## “దిశ” యాప్ తో మహిళలకు సంపూర్ణ రక్షణ

### ఆలమూరు ఎస్సై శివప్రసాద్

**కోనసీమ**



దిశ యాప్ తో మహిళలకు పూర్తి భద్రత ఉంటుందని ఆలమూరు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండల పరిధి కొత్తూరు సెంటర్, ఆలమూరు పోలీస్ స్టేషన్, మడికి జాతీయ రహదారి వద్ద మహిళా పోలీసులతో మూడు బృందాలుగా ఏర్పాటు చేసి దిశ యాప్ వలన మహిళలకు వచ్చే ఉపయోగాలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్లు ద్వారా దిశ యాప్ వాడటం వలన మహిళలకు సంపూర్ణ రక్షణ ఉంటుందని, ఆపత్కాలంలో ఈ యాప్ ను ఉపయోగిస్తే క్షణాల్లో వారు ఏ ప్రాంతంలో ఉన్న రక్షిస్తామని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించేందుకు ఆలమూరు మండలంలో మహిళా పోలీసులతో ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశామని వారు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తున్నారని, వారి సేవలను మహిళలు, విద్యార్థినులు, చిన్నారులు ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. అలాగే మహిళల సెల్ ఫోన్లలో దిశ యాప్ లేనివారికి వెంటనే దిశ యాప్ ను అప్లోడ్ చేసి దాని యొక్క ఉపయోగాలను వివరించారు.

# టీఎస్ఆర్టీసీ తార్నాక ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

**హైదరాబాద్ :**

ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎస్ఆర్టీసీ తార్నాక ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు వీసీ సజ్జనార్ తెలిపారు. ఈరోజు నుంచి వారం రోజుల పాటు ఈ రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. అలాగే రక్తదానం చేయాలనుకునే వాళ్లు 9591478666 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అని వివరించారు. ప్రతి పౌరుడు స్వచ్ఛంధంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని అన్నారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి అండగా నిలవాలన్నారు. అలాగే ట్విట్టర్ వేదికగా ఓ ప్రమాద వీడియోను షేర్ చేస్తూ... యూటర్న్ ల వద్ద అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణం చాలా డేంజర్ అని చెప్పుకొచ్చారు. మీతోపాటు ఇతరులు కూడా ప్రమాదాల బారిన పడతారని సూచించారు. ప్రయాణికులంతా జాగ్రత్తగా ఉండాలని ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వివరించారు. రోడ్డు ప్రమాదంతో విషాదం అలుముకున్న ఉద్యోగి కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) అండగా నిలిచింది. అకాల మృత్యువు వెంటాడిన కండక్టర్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయాన్ని అందించి భరోసా కల్పించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జగిత్యాల డిపోకు చెందిన కండక్టర్ బొల్లం సత్తయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. జగిత్యాల నుంచి వరంగల్ వెళ్తున్న టీఎస్ఆర్టీసీ బస్సును రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీ కొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. మల్యాల - బలవంతాపూర్ స్టేజీ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఇంటికి పెద్ద దిక్కు మృతి చెందడంతో బాధిత కండక్టర్ కుటుంబంలో విషాదం అలుముకుంది.ఈ ఆపద సమయంలో యూబీఐ సూపర్ శాలరీ సేవింగ్ అకౌంట్, రూపే కార్డు బాధిత కుటుంబానికి అక్కరకొచ్చింది. సిబ్బంది, ఉద్యోగుల సాలరీ అకౌంట్స్‌ను ఇటీవల యూబీఐకి టీఎస్ఆర్టీసీ యాజమాన్యం మార్చింది. ఆర్థిక ప్రయోజనంతో కూడిన సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్, రూపే కార్డు తీసుకోవాలని ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. సంస్థలోని ఉద్యోగులందరూ వారు నివసిస్తున్న ప్రాంతాల్లోని యూబీఐ బ్రాంచీల్లో సంస్థ సూచించిన ఖాతాను తెరిచి రూపే కార్డులను తీసుకున్నారు. ఈ ఖాతా, కార్డు ద్వారా ఉచిత ప్రమాద బీమా సౌకర్యం ఉండటంతో ఉద్యోగులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది. ప్రమాదాలు జరిగిన సమయంలో సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్ కింద (ఉద్యోగి వేతనం ప్రకారం) కనీసం రూ.40 లక్షలు, రూపే కార్డు కింద మరో రూ.10 లక్షలను యూబీఐ అందజేస్తోంది.ఈ మేరకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల డిపో కండక్టర్ బొల్లం సత్తయ్య కుటుంబానికి రూ.50 లక్షల విలువైన 2 చెక్కులను యూబీఐ అధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనార్, ఐపీఎస్ మంగళవారం బస్ భవన్‌లో అందజేశారు. రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించడంపై కండక్టర్ సత్తయ్య భార్య బొల్లం పుష్పతో పాటు కొడుకు ప్రవీణ్ కుమార్, కూతురు మాధవీలత సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## జిల్లా కలెక్టర్ చెప్పినా... రెచ్చిపోతున్న మట్టి మాఫియా

**నూజివీడు**

చాట్రాయి మండలం చనుబండ గ్రామ చిన్న చెరువులో యధేచ్ఛగా అడ్డు అదుపు లేకుండా మట్టి దోపిడీకి గురవుతున్నా... .రెవిన్యూ,ఇరిగేషన్ అధికారుల కన్నెత్తి చూడకపోవడంతో చెరువుకు అనుకుని నివాసం ఉంటున్న గ్రామ ప్రజలు మట్టి అక్రమ రవాణాను అడ్డుకుని ధర్నా నిర్వహించారు.
చెరువులో మట్టి దోపిడీతో భారీ గుంతలు ఏర్పడి చిన్నారుల పాలిట ప్రమాదభరితంగా మారిందని, సత్తుపల్లి వెళ్ళే మార్గపు ప్రధాన రహాదారి అడుగుభాగం మట్టిని కూడా తీసివేయడంతో అక్రమార్కుల దాటికి చెరువుకట్ట కుంగి పోయే ప్రమాదం వుందని టిడిపి నేతలు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న గ్రావెల్, మట్టి మాఫియాను అరికట్టాలని పలుమార్లు అధికార యంత్రాంగంకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని కాలనీ వాసులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ స్వయంగా పరిశీలించి మట్టి దోపిడీకి కాకుండా చూడాలని ఆదేశించినా, చర్యలు శూన్యమని టిడిపి నాయకుడు మోరంపూడి శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న ఇళ్ళ పేరుతో మట్టిని అమ్ముకుని అధికార పార్టీ నేతలు సొమ్ములు చేసుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మట్టి దందాలో అధికారులకు వాటాలు ఇస్తున్నామని అక్రమార్కులు చెప్పడం వెనుక చనుబండ గ్రామ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


## చేపల వేటకు మత్స్యకారులు సిద్ధం

**విశాఖపట్నం**
సుమారు రెండు నెలల విరామం అనంతరం గంగపు త్రులు చేపల వేటకు సిద్ధమైయ్యారు.మరపడవలు, ట్రాల ర్లు, మినీ బోట్లు బుధవారం అర్ధరాత్రి దాటాక చేపల వేటకు వెళుతున్న నేప థ్యంలో మత్స్యకారుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లికి విశేష పూజలు నిర్వ హించారు. ఫిషింగ్ హార్బర్ ఆవరణ లోని గంగమ్మ తల్లికి తెల్లవారుజాము నుంచి పంచామృత అభిషే కాలు, పసు పు నీళ్లతో అర్చన లు, కుంకుమార్చ నలు, అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. మహిళలు ఊరేగిం పుగా సముద్రతీరా నికి వెళ్లి సముద్రు డిని పసుపు నీళ్లతో అభిషేకించి ప్రార్థిం చారు.మత్స్యకా రుల సంఘం నాయ కులు వాసుపల్లి జానకి రామ్, ఎమ్మె ల్యే గణేష్ కుమార్ అమ్మవారిని దర్శిం చుకున్నారు. ఉత్స వాల నేపథ్యంలో ఫిషింగ్ హార్బర్ లో కోలాహలమైన వాతావరణం నెలకొంది.

## పేరేచర్లలో దారుణ హత్య

**గుంటూరు**
మేడికొండూరు మండలంలోని పేరేచర్ల ॥ కాలనీలో దారుణ హత్య జరిగింది. సత్తెనపల్లికి చెందిన వ్య క్తిని గుర్తు తెలియని దుండగులు గొంతుకోసి హత్య చేశారు. మేడికొండూరు సీఐ వా సు తెలిపిన వివరాలు.. జగనన్న కాలనీ చిన్న కాలవలో 32 ఏళ్ల వ యస్సున్న వ్యక్తి మృతదేహం పడిఉండగా స్థానికులు పోలీసులకు స మాచారం ఇచ్చారు. దీంతో వారు మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాల ప్రకారం మృతుడు సత్తెనపల్లి లోని శాలివాహన కాలనీకి చెందిన మందా సైదేశ్వరరావు అని పోలీసులు గుర్తించారు. మృతుడి తలపైన రాడ్ కొట్టినట్లు గాయాలున్నాయి. అంతేకాకుండా గొంతుకోసి ఉం ది. మృతదేహం పక్కనే టాటా ఏస్ ఆటో నిలిపి ఉంది. ఆటో సైదేశ్వ రరావు పేరు మీద ఉంది. ఆటో బాడుగ పేరుతో లేదా నమ్మకంగా ఎవరో పథకం ప్రకారం ఇక్కడకు తీసుకువచ్చి సైదేశ్వరరావును హ త్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్లను రప్పించి ఆధారాలను పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**విశాఖపట్నం**

గూడ్స్ రైలు అనకాపల్లి-తాడి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు తప్పింది. ఐదు బోగీలు పట్టాలు తప్పడంతో ట్రాక్ దెబ్బతిన్నది. దాంతో విశాఖ-విజయవాడ మార్గంలో రైళ్ల రాకపోకలపై ప్రభావరం పడింది. వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టారు. అధికారులు ఐదు రైళ్లు రద్దు చేసారు. వందే భారత్ ఎక్స్ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా నడిచింది.

## విశాఖలో కంటేక్ ఎక్స్ పో

**విశాఖపట్నం**
బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం సెంటర్ ఆధ్వర్యంలో కంటేక్ ఎక్స్పో జరుగుతుందని సంస్థ జాతీయ మాజీ వైస్ చైర్మన్ సి హెచ్. రామకోటయ్య వెల్లడించారు. విశాఖ లో బిల్డర్స్ టర్నోవర్ 7 వేల కోట్లు మేరకు వుందని తెలిపారు. బాయ్ విశాఖ సెంటర్ 1978లో స్థాపించబడిం ది అని గుర్తు చేశారు. నిర్మాణ పరిశ్ర మ, భారత ప్రభుత్వంచే గ?ర్తింపు పొందింది అన్నారు. బాయ్ కి దేశం అంతటా 180 కేంద్రాలలో 30, 000 కంటే ఎక్కువ మంది సభ్యులను కలిగి ఉంది అని తెలిపారు. బాయ్ కాంటేక్ ఎక్స్పో ఈనెల 16, 17, 18 తేదీల్లో ఎంవిపీ కాలనీ గాదిరాజు ప్యాలెస్లో నిర్వహిస్తున్నాముఅన్నారు. విశాఖ పట్నంలో ఉన్న క్లయింట్లతో, ఇతరు లతో విజయవంతమైన వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడానికి అవకాశం కల్పించడం కోసం ఈ ఎక్స్పో అద్భుతమైన ప్రదర్శనను అందిస్తుంది అని పేర్కొన్నారు.

## కన్నా అప్పీలును కొట్టేసిన న్యాయస్థానం

**విజయవాడ**
కన్నా లక్ష్మీనారాయణ పెద్ద కోడలు శ్రీలక్ష్మి కీర్తి గతేడాది విజయవాడ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో గృహహింస పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.... దీన్ని విచారించిన న్యాయస్థానం ఆమెకు రూ.కోటి పరిహారం, గృహవసతి నిమిత్తం నెలకు రూ.50 వేలు, ఆమె కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం మరో రూ.50 వేలు ఇవ్వాలని తీర్పును వెలువరించింది. దీనిపై కన్నా లక్ష్మీనారాయణ మహిళా సెషన్స్ కోర్టుకు అప్పీలుకు వెళ్లారు. దీనిపై న్యాయస్థానం మంగళవారం తీర్పును వెలువరించింది. కన్నా అప్పీలును కొట్టివేస్తూ, కింది కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ఆదేశించింది.

## తాహశీల్దార్ కార్యాలయనికి తాళం

**సూర్యాపేట**
డబల్ బెడ్ రూమ్ అందని బాధితులు తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఘటన మోతె మండలంలో జరిగింది. వివిధ గ్రామంలో పంపిణీ చేసిన డబల్ బెడ్రూంలో అవకతవకలు జరిగాయని పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పట్టించుకోలేదని ఆందోళనకు దిగారు. ఆందోళనదారులకు సిపిఎం పార్టీ నాయకులు మద్దతుగా నిలిచారు. గతంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఇండ్ల పట్టాలను పంపిణీని ఇళ్లు రాని లబ్ధిదారులు అడ్డుకున్నారు. .

# పర్యాటక ప్రదేశంగా స్మృతివనం

### విగ్రహం చుట్టూ హరితహారం



**విజయవాడ :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ స్మృతివనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దనున్నామని అధికారులు తెలిపారు. మొత్తం 19.4 ఎకరాల విస్తీర్ణంలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుచేస్తున్నారు.పర్యాటక ప్రదేశంగా అంబేద్కర్ స్మృతివనం తీర్చిదిద్దుతామని రాష్ట్ర హరిత, సుందరీకరణ కార్పొరేషన్ ఎండీ బి. రాజశేఖర్ రెడ్డి వెల్లడించారు. విజయవాడ నడిబొడ్డున అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 125 అడుగుల అంబేద్కర్ స్మృతి వనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద ్దనున్నామన్నారు. అంబేద్కర్ స్మృతి వనంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఏయే ప్రాంతంలో సుందరీకరణ పనులు ప్రారంభించాలో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సీఎం జగన్ ఆదేశాలు, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి సూచనలతో పనులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ స్మృతివనం మొత్తం విస్తీర్ణం 19.4 ఎకరాలు కాగా, ఇందులో 8.9 ఎకరాలు పచ్చదనానికి కేటాయించామని కార్పొరేషన్ ఎండీ బి.రాజశేఖర రెడ్డి వివరించారు. విగ్రహం చుట్టూ పచ్చదనం ఉండేలా ముందు వైపు 1.65 ఎకరాలు, వెనుక వైపు 5.39 ఎకరాలు, కుడివైపు 1.48 ఎకరాలు, ఎడమవైపు 0.35 ఎకరాల్లో గ్రీనరీ పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ హరితహారంలో మొఘల్ గార్డెన్ ల్యాండ్ స్కేపింగ్ భాగాలు, వెదురు ఫ్రేమ్ లో బౌగెన్విలేయా మొక్కలు, గులకరాయి నమూనాలు, రంగురంగుల పూలలో కనిపించే జాతీయ పక్షి నెమలి కనిపిం చనున్నాయి. ప్రతిపాదిత స్థలంలో నీటిపారుదల సౌకర్యంతో హరితహారం పనులు ప్రారంభమయ్యాయని రాజశేఖర్ రెడ్డి చెప్పారు. ఎగ్జిక్యూటింగ్ ఏజెన్సీతో పాటు ఆర్కిటెక్ట్లు, ఇంజినీర్ల, హార్టికల్చర్ అధికారుల బృందం సైట్ను సందర్శించి, పని అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను స్పష్టంగా అంచనా వేశారని బి.రాజశేఖర్ రెడ్డి వివరించారు. విజయవాడ స్వరాజ్ మైదాన్లో ఏర్పాటు చేయనున్న భారీ అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటుచేస్తున్నారు. అంబేద్కర్ స్మృతివనం వద్ద లైబ్రరీ, మ్యూజియమ్, గ్యాలరీ ఏర్పాటుతో పాటు, ఆయన జీవిత విశేషాలు ఇందులో ప్రదర్శించనున్నారు. అంబేద్కర్ సూక్తులను కూడా ప్రదర్శించనున్నారు. పార్కు వద్ద రహదారిని విస్తరించి, ఫుట్పాత్ను కూడా అభివృద్ధి చేయాలని, రెండింటిని ఆకర్షణీయంగా తీర్చి దిద్దాలని గతంతో సీఎం జగన్ స్పష్టం చేశారు. ప్రాంగణంలో ఒక కన్వెన్షన్ సెంటర్ కూడా వస్తుందని అధికారులు స్పష్టం చేశారు. విగ్రహ విడిభాగాలను ఒక్కొక్కటిగా అమర్చు కుంటూ మొత్తం 13 దశల్లో విగ్రహ నిర్మాణాన్ని పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. విగ్రహ నిర్మాణంలో 352 మెట్రిక్ టన్నుల ఉక్కు, 112 మెట్రిక్ టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నామని వెల్లడించారు. విగ్రహం తయారీతో పాటు దాని చుట్టూ సివిల్ వర్క్స్, సుందరీకరణ, మైదానాన్ని ప్రధాన రహదారితో అనుసంధానం చేసే పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు.

# తాతయ్యగుంట జాతర వారోత్సవాలు

**తిరుపతి :**
శ్రీ తిరుపతి తాతయ్యగుంట జాతర వారోత్సవాలు ముగిశాయి.. అమ్మవారి జాతరను నాలుగు వారాల పాటు వైభవంగా నిర్వహించారు ఆలయ అధికారులు.. నాలుగు మంగళవారాల్లో విశేష అలంకరణ చేసారు.. చివరి వారంలో రూ.10 రూపాయల నోట్ల నుంచి రూ.500 నోట్లను మాల రూపంలో తయారు చేశారు. ఆలయంలోని నలుమూలల అలంకరణ చేశారు. అమ్మవారిపై రూ.500 నోట్ల కట్టలను అలంకరణ చేశారు. చివరి వారం కావడంతో అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. భారీ స్థాయిలో అమ్మవారికి పొంగళ్ళు, జంతు బలులు సమర్పించారు. నేటి అర్ధరాత్రితో అమ్మవారి జాతర వారాలు వైభవంగా ముగియనున్నాయి ఏటా డిసెంబరు నెల వచ్చేసరికి గంగమ్మ జాతర గురించి చర్చల సందడి మొదలైపోతుంది. జాతర జరిగేది మే నెల మొదటి మంగళవారం అయినప్పటికీ.. .దాదాపు 4 నెలల ముందుగానే..అంటే డిసెంబరులో వచ్చే రెండో ఆదివారం అర్ధరాత్రి చాటింపు వేసి తేదీలు ప్రకటించేస్తారు. ఎందుకంటే..ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా జాతర సమయానికి స్వస్థలాలకు చేరుకోవాలన్నది ఓ కారణం కాగా... వారం పాటూ వైభవంగా జరిగే జాతరకు ఏర్పాట్లు చేసుకోవాలంటే ఆమాత్రం సమయం ఉండాలి మరి. వందల సంవత్సరాలుగా సాగుతూ వస్తున్న ఈ జాతరకు కేవలం తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే కాదు...ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రవాసులు కూడా భారీగా తరలివస్తారు. తిరుపతి నగరంలో కొలువు తీరిన ఏడుగురు అక్కా చెల్లెళ్ళు అంకాళమ్మ, మాతమ్మ, ఉప్పంగి మారెమ్మ, తాళ్ళపాక పెద గంగమ్మ, ముత్యాలమ్మ, వేషాలమ్మ, గంగమ్మలకు జాతర కైంకర్యాలు ఘనంగా నిర్వహిస్తారు. గంగమ్మను శ్రీ వేంకటేశ్వర స్వామికి చెల్లెలిగా భావిస్తారు. అందుకే టీటీడీ తరపున అమ్మవారికి పట్టుచీర సమర్పిస్తారు అధికారులు. మే నెల మెదటి మంగళవారం అర్ధరాత్రి కైకా వంశీయుల ఆధ్వర్యంలో చాటింపు కార్యక్రమంతో జాతర మె?దలవుతుంది..ఆ తర్వాత మంగళవారానికి జాతర పూర్తవుతుంది. అయితే ఈ వారం రోజులు మాత్రం ఊర్లోంచి ఎవ్వరూ పొలిమేర దాటి వెళ్లరు. రాయలసీమలో పాలేగాళ్ళ రాజ్యం నడుస్తున్న రోజుల్లో తిరుపతిని పాలించే పాలెగాడి అరాచకత్వానికి అంతుండేది కాదు. తిరుపతి పాలెగాడి కన్నుపడిన మహిళా తప్పించుకునే అవకాశం ఉండేది కాదు. ఆ కామాంధుడి బారినుంచి మహిళలను తప్పించేందుకు ప్రజలు నానా కష్టాలు పడేవారు. తిరుపతికి సమీపం అవిలాల గ్రామంలోని కైకాల కులస్థుల ఇంట్లో పుట్టిన ఓ ఆడబిడ్డను తిరుపతికి చెందిన ఓ వ్యక్తి దత్తత తీసుకున్నాడు..ఆమె పేరు గంగమ్మ. ఓ సారి పాలిగాడి కన్ను గంగమ్మపై పడింది... ఆమెను బలవంతం చేయబోతుండగా ఉగ్రరూపం దాల్చిన గంగమ్మ పాలెగాడిని సంహరించేందుకు వెంటాడింది. భయపడిన పాలెగాడు దాక్కున్నాడు..తనని బయటకు రప్పించేందుకు వారం రోజుల పాటూ రకరకాల వేషాలు వేసుకుని వెతికింది గంగమ్మ. బైరాగిగా, మాతంగిగా ఇంకా రకరకాల వేషాలు వేసుకుని తిరిగింది. చివరిగా దొర వేషంలో వెళ్లడంతో...తన దొరే వచ్చాడనుకుని పాలెగాడు బయటకు రావడంతో విశ్వరూపం చూపిన గంగమ్మ ఆ రాక్షసుడిని సంహరించింది. మరుసటి రోజు మాతంగి వేషధారణలో వెళ్లి పాలెగాడి భార్యని ఓదార్చుతుంది. దుష్టుడైన పాలెగాడిని సంహరించిన గంగమ్మ తల్లిని శక్తి స్వరూపిణిగా భావించి జాతర చేయడం ప్రారంభించారు.

# జక్కంపూడిలో ఎమ్మెల్యే పర్యటన

**మైలవరం**
యన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం లో బుధవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. జక్కంపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో ఎంపిపి ప్రసన్న రాణి, కుమారి, జడ్పీటీసీ ఇ సభ్యులు సువర్ణ రాజు, ఎంపిటిసి సభ్యురాలు కల్పన, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ జక్కంపూడి గ్రామస్థులు కు నా శు భాకాంక్షలు. గ్రామంలో అవసరమైన అన్ని సౌకర్యాలు ఈ ప్రభుత్వం కల్పించింది. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కి నాడు నేడు కు జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని అన్నారు.వైద్య పరంగా అన్ని రకాల సేవలు గ్రామంలో అందుబాటులో కి తెచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళు ్లగా వైసిపి ప్రభుత్వం పాలన సాగిస్తుంది. దేవినేని ఉమ కు సిగ్గు శరం ఉందా.. జక్కంపూడి లో భూములు లాక్కుని ఒక్కరికి కూడా ఇళ్లు ఇవ్వలేదు. ఇదే గ్రామంలో 160మందికి మేము ఇళ్లు కట్టించి ఇచ్చామని అన్నారు.
మూల పడిన వైద్య ఆరోగ్య కేంద్రం ను మేము నిర్మించాం. మూడు కోట్ల తో యాభై పడకల ఆస్పత్రి నిర్మాణం చేశాం. ఇవేమీ చేయకుండా మాటకు ముందు ఉమ శ్వేత పత్రం అంటాడు. ఏమిచేయని వాడు, పనికి మాలిన వాడు దేవినేని ఉమ. మేము ప్రజల కోసం ఎంత చేసినా.. చెప్పనక్కర్లేదు.. మా పని, అభివృద్ధే కనిపిస్తుంది. ఎప్పటి నుంచో ఉన్న వివాదాలను నాకు ఆపాదించడం దేవినేని ఉమ చేతకాని తనానికి నిదర్శనమని అన్నారు.
భూముల సమస్యలు కూడా త్వరలోనే పరిష్కారం అవుతాయి. కోతల రాయుడు దేవినేని ఉమ .. కూడా పుష్ప, ఫైర్ అనుకుంటాడు. కానీ మాటల తో మాయ చేయటం మాత్రమే ఉమకు తెలుసు. ఉమ చెప్పినట్లు అన్నీ ఆయన చేస్తే.. నేడు ప్రజలు ఇన్ని ఇబ్బందులు ఎందుకు పడుతున్నారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ లు, సచివాలయాల ద్వారా గ్రామాల రూపు రేఖలు మార్చాం. మైలవరం లో అభివృద్ధి ఎవరి హయాంలొ ఎంత జరిగిందో ప్రజలను అడిగితే చెబుతారు. సచివాలయం, విలేజ్ క్లినిక్ లను సకాలంలో పూర్తి చేసిన గంధం శ్రీనివాస్ ను అభినందిస్తున్నానని అన్నారు. పూర్తి గా నాణ్యత తో కూడిన ముడి సరుకు వాడటం గొప్ప విషయం. ఒక బిల్డర్ గా ఈ కట్టడాల పై సంతృప్తి వ్యక్తం చేస్తున్నానని అయన అన్నారు.

## భట్టి పాదయాత్ర

**నల్గొండ**
సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర 90వ రోజు నల్లగొండ జిల్లాలో కొనసాగింది. నాగార్జునసాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండలం ఆవగూడెం క్రాస్ రోడ్ నుంచి బట్టి విక్రమార్క పాదయాత్ర ఈరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభం అయింది. ఆవగూడం క్రాస్ రోడ్, లక్ష్మీదేవి గూడెం క్రాస్ రోడ్ మీదుగా నల్లగొండ నియోజకవర్గం కనగల్ ఎక్స్ రోడ్ లోకి భట్టి విక్రమార్క పాదయాత్ర ప్రవేశించింది. లంచ్ బ్రేక్ తరువాత నల్గొండ నియోజకవర్గంలోని పర్వతగిరి, దోరేపల్లి ఎక్స్ రోడ్, ధర్వేశిపురం, జి చెన్నారం గ్రామాల వరకు పాదయాత్ర కొనసాగింది.

## తెలంగాణ యూనివర్సిటీ లో అందోళనలు

**నిజామాబాద్**
తెలంగాణ యూనివర్సిటీ లో అందోళనలు కొనసాగుతున్నాయి. వేతనాలు చెల్లించాలంటూ 3వ రోజు అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నాకు దిగారు. వంటలు చేయడం నిలిపి వేసి విధునుల బహిష్కరించారు. ఉద్యోగుల సమ్మెను పరిష్కరించి మెస్ లు తెరిపించాలంటూ విద్యార్థులు కుడా ఆందోళన కు దిగారు.

## సత్యదేవుడి సన్నిధిలో పవన్ కళ్యాణ్

**అన్నవరం**
జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ప్రారంభ సందర్భంగా అన్నవరంలో సత్యదేవుని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పవన్ కళ్యాణ్ కు పూర్ణ కుంభం తో స్వాగతం ఫలికారు. సత్యదేవుని దర్శనానంతరం వేద పండితులతో ఆశీర్వాదం నిర్వహించారు . అన్నవరం సత్యదేవుని చిత్రపటాన్ని ఆలయ సిబ్బంది పవన్ కళ్యాణ్ కి అందించారు అనంతరం పవన్ కళ్యాణ్ రామరాజు గెస్ట్ హౌస్ కి తరలి వెల్లారు

## సీఎం కార్యక్రమంతో ట్రాఫిక్ చిక్కులు

**హైదరాబాద్**
బుధవారం నాడు ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వరకు భారీగా ట్రాఫిక్ జామ్ లయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ ట్విన్ టవర్స్కు శంకుస్థాపన చేయడానికి వచ్చారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దాంతో స్కూల్స్, కాలేజీలు, ఆఫీసులకు వెళ్లే ప్రయాణీకులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## మణిపాల్ ఆసుపత్రికి యాసిడ్ దాడి బాధితురాలు తరలింపు

**ఏలూరు**
ఏలూరు జిల్లాలో మహిళపై యాసిడ్ దాడి ఘటనలో బాధితురాలికి మెరుగైన వైద్యం అందించేందుకు మణిపాల్ ఆసుపత్రికి తరలించామని రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత వెల్లడించారు. మహిళపై యాసిడ్ తో దాడి విషయం తెలియగానే ఏలూరు జిల్లా ఎస్పీతో ఫోన్లో హోం మంత్రి మాట్లాడారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందేలా చర్యలకు అధికారులను ఆదేశించారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుంది. దాడిలో బాధితురాలికి కుడివైపు కన్నుకి, చాతి కుడివైపున గాయాలు అయినట్టు నిర్ధారణఅయిందని మంత్రి అన్నారు.

## రోడ్డు రోలర్ కింద పడి చిన్నారి దుర్మరణం

**గుంటూరు**

తాడికొండకు చెందిన షేక్ మాబూ సుభాని బైక్ పై భార్య,చిన్నపిల్లాడితో కలసి తాడికొండ వెళ్తున్నాడు. పెదకాకాని మండలం కొప్పురావూరు అండర్ పాస్బ్రిడ్జి వద్ద తారు రోడ్డు వేస్తుండగా స్కూటిపై సుభానిబండిని పోనిస్తుండగా అది స్కిడ్ అయి పడిపోయింది. దీంతో మూడేళ్ల బాబు రోడ్డుపై పడ్డాడు. అప్పటికే తారు రోడ్డును చదును చేస్తున్న రోడ్ రోలర్ బాలుడిపైకి ఎక్కింది. దీంతో బాలుడు అక్కడికక్కడే నుజ్జు నుజ్జు అయ్యాడు..స్పాట్ లోనే చనిపోయాడు.

## బొజ్జన్నకొండ అభివృద్ధి శూన్యం

**అనకాపల్లి**
అనకాపల్లి సమీపంలోని ప్రముఖ బౌద్ధక్షేత్రం బొజ్జన్నకొండ అభివృద్ధి కాకపోవడానికి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి వైఫల్యమే కారణమని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. బొజ్జన్నకొండ వద్ద వైసీపీ ప్రభుత్వానికి సెల్ఫీ సవాల్ విసిరారు.టీడీపీ హయాంలో బొజ్జన్నకొండ అభివృద్ధికి 7 కోట్లు మంజూరయ్యా యని, పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో కార్యరూపం దాల్చలేదన్నారు. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి నాలుగేళ్ల నుంచి ప్రకటనలకే పరిమితమయ్యారు తప్ప బొజ్జన్నకొండ అభివృద్ధి విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శిచారు. టీడీపీ హయాంలో నిర్మించిన వాటికి వైసీపీ రంగులు వేసుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదన్నారు. మంత్రి అమర్నాథ్కు గాల్లో మేడలు కట్టడం, ప్రచార పిచ్చి తప్ప అభివృద్ధి అంటే అర్థం తెలియదని విమర్శించారు. బొజ్జన్నకొండను అభివృద్ధి చేయడం చేతకాకపోతే మంత్రి, ఎంపీ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# డోలీలో నిండు గర్భిణిని 8 కిలోమీటర్లు

**ఏలూరు :**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపెల్లి పంచాయితీ బూరిగ గ్రామంలో 40 కుటుంబాలు వారు కొండ శిఖర్ గ్రామంలో జీవనం సాగిస్తున్నారు. కరెంటు సౌకర్యం లేని గ్రామం. ఏదైనా అనారోగ్యం వస్తే బూరుగ గ్రామం నుండి వాణిజ గ్రామం మెంటాడ మండలం ఎనిమిది కిలోమీటర్లు డోలు కట్టుకొని వాణిజ గ్రామం వరకు తీసుకెళ్లే పరిస్థితి ఉంది. అక్కడి నుంచి ఆటోలో మెంటాడ ప్రభుత్వాసుపత్రికి డోలి ప్రయాణం వారిని ఇబ్బందులకు గురిచేస్తోంది. సోమిల చిన్నమ్మి (25) 8 నెలల గర్భిణికి వైద్య సేవల కోసం 8 కిలోమీటర్లు కారు దట్టమైన అడివిలో డోలి ప్రయాణం చేయాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇకనైనా తమ సమస్యలు పట్టించుకుని, పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల అవుతున్న కనీసం తాగటానికి నీరు, కరెంటు, రోడ్డు సౌకర్యం లేనటువంటి గిరిజన గ్రామంలో పశువులు, మనుషులు ఒకే చోట మంచినీరు తాగి బతుకుతున్నా. తరచూ అనారోగ్యం వస్తుంది డోలు మూసుకుని వెళ్లే పరిస్థితి ఇప్పటికీ ఉంది అభివృద్ధికి కొన్ని కోట్లు ఖర్చు పెట్టావని ఐటిడిఏ అధికారులు రాజకీయ నాయకులు ప్రకటనలు ప్రకటిస్తున్నారు. వాస్తవానికి రియల్ ఎస్టేట్ వ్యాపారం, మైనింగ్ కొనులు కోసం. టూరిజం ప్రాంతాల్లో రోడ్లు వేస్తున్నారు తప్ప.. కనీసం మా కొండ శిఖర గ్రామాలకి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఉదయం 6 గంటలకు బయలుదేరితే మూడు గంటలు డోలు ప్రయాణంలో వాణిజ గ్రామానికి వెళ్లే పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో మా ఓట్ల కోసం అయితే అనేక హామీలు ఇస్తుంటారు. మమ్మల్ని మోసం చేసి మా భూములు కూడా స్థానిక రెవెన్యూ అధికారి రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు కుమ్మక్కవి మా భూమి రికార్డులన్నీ మార్పు చేశారు. మాకు బతకడానికి ఏ ఆధారం లేదు. కొల్లూరు ప్రాంతంలో వలసలు పోతున్నాం. మా ప్రాణాలు కాపాడుకోవాలంటే డోలి కట్టుకొని ఎనిమిది కిలోమీటర్ల ప్రయాణం చేయాలి. ఇవి మా బతుకులు. ఇప్పటికైనా మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తారని ఆశిస్తున్నాము. గ్రామ పెద్ద సోముల కొత్తయ్య. సోమల జోగయ్య హాస్పిటల్ కి వెళ్లి చెకప్ చేయించారు. తక్షణమే మారుమూల గ్రామాలకు కరెంటు రోడ్డు మంచినీరు సౌకర్యం కల్పించాలి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు కే గోవిందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్‌లో 'డీకే' మంత్రం పనిచేస్తుందా..?

**హైదరాబాద్ :**

తెలంగాణ కాంగ్రెస్ పై అధిష్టానం ఫుల్ ఫోకస్ చేసింది. కర్ణాటక ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ అవే ఫలితాలను ఇక్కడ రిపీట్ చేయాలని భావిస్తోంది. ఇందుకు కర్ణాటకలో అన్ని తానై నడిపించిన నేతకి తెలంగాణలో కూడా క్రియాశీలకంగా వ్యవహరించేలా అగ్రనేత ప్రియాంక గాంధీ ఆదేశాలిచ్చినట్లు తెలుస్తుంది. ఇంతకీ తెలంగాణలో తన సత్తా చాటాలని భావిస్తున్న ఆ నేత ఎవరు?.. ఏంటీ ఆలోచిస్తున్నారా..? అయితే ఈ హాట్ పొలిటికల్ స్టోరీ చదివేయండి. కర్ణాటక మాదిరిగా ప్రియాంక గాంధీ తెలంగాణ పై దృష్టిసారించారు. అక్కడి మాదిరి ఇక్కడ గెలవడానికి వ్యూహాలు పన్నుతున్నారు.. అక్కడ అన్ని తనై నడిపించిన కర్ణాటక డిప్యూటీ సీఎం, కేపీసీసీ ప్రెసిడెంట్ డీకే శివకుమార్ ఇక తెలంగాణలోనూ తన సత్తా చాటాలని చూస్తున్నారు.. రాహుల్, ప్రియాంక గాంధీ అండ, రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో ఉన్న సాన్నిహిత్యంతో తెలంగాణలో అడుగుపెట్టాలని చూస్తున్నట్లు గాంధీ భవన్లో టాక్ నడుస్తోంది. ఇప్పటికే తను మార్కును చూపించిన డీకే.. తెలంగాణ పార్టీలో చేరికల నుండి గెలిచే అవకాశం ఉన్న స్థానాలు, అభ్యర్థుల ఎంపిక సునీల్ రిపోర్ట్ ఆధారంగా ఏఐసిసి పెద్దలతో కలిసి డీకే పరిశీలిస్తున్నట్లు సమాచారం..కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత డీకే వద్దకు టీకాంగ్రెస్ నేతలు క్యూ కట్టారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీనియర్ నేత వీహెచ్, మధుయాష్కి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలు, ఇతర కాంగ్రెస్ నేతలు డీకేని కలిసి వచ్చారు.. ఇటు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సైతం డీకే తో పలుమార్లు భేటీ అయ్యారు.. అప్పటి నుండే వైస్సార్టీపీ కాంగ్రెస్ లో విలీనం వార్తలు జోరందుకున్నాయి.పార్టీలో చేరికలపైన కూడా డీకే దృష్టి సారించినట్లు తెలుస్తుంది.. సునీల్ నివేదికలో భాగంగా పొంగులేటి, జూపల్లి కృష్ణారావు, కూచుకుంట్ల దామోదర్ రెడ్డి లాంటి నేతలపై డీకే దృష్టి సారించారు.. వారు ఇప్పటికే డీకే తో కూడా భేటీ అయినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.. పార్టీలో చేరే నేతలకు టికెట్లతో పాటు భవిష్యత్ లో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పిస్తునట్లు సమాచారం. కర్ణాటక ఎన్నికల మాదిరి నేతలంతా కలిసికట్టుగా పని చేయాలని డీకే తెలంగాణ నేతలకు సూచిస్తున్నారని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది.. అందుకే టీకాంగ్రెస్ నేతలు కర్ణాటక మంత్రాన్ని జపిస్తున్నట్లు పేర్కొంటున్నారు.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ జోరును పెంచింది. ఈ క్రమంలో కర్ణాటకలో అన్నీ తానై విజయ తీరాలకు చేర్చిన డీకే మంత్రం తెలంగాణలో పనిచేస్తుందా..? డీకే మాట విని నేతలు కలికట్టుగా పని చేస్తారా..? గ్రూపుల లొల్లి సద్దుమణుగుతుందా..? పార్టీ నేతల అభిప్రాయమేంటి..? ఇవన్నీ క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే..

# బహుజనులకు రాజ్యాధికారమే బీఎస్పీ అంతిమ లక్ష్యం

**-బిసిలకు 70 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి అసెంబ్లీకి పంపిస్తాం**

**-బీఎస్పీ మంథని నియోజకవర్గం ఇంచార్జి జనగామ రవి కుమార్**



**మంథని**

బహునులకు రాజ్యాధికారం తీసుక రావడమే మా అంతిమ లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రములో బీఎస్పీ పార్టీ నాయకులు పని చేస్తున్నారని బీఎస్పీ మంథని నియోజకవర్గం ఇంచార్జి జనగామ రవి కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి మంథని మండలంలోని ఉప్పట్ల గ్రామంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి బీఎస్పీ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించి ఏనుగు గుర్తును ప్రచారం చేశారు ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి రవికుమార్ మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం రావాలనే అంతిమ లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. మహనీయులు కలలు కన్న రాజ్యం కోసం జ్యోతి రావు పూలే, అంబేద్కర్, కాన్షిరాం ఆశయాలను నెరవేర్చడం కోసం, బహుజన రాజ్యం తీసుక రావడం కోసం పేద బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేయడం కోసం బీఎస్పీ పార్టీ జాతీయ అధ్యక్షురాలు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి పోరాటం చేస్తున్నారన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రము లో ప్రతి గడప గడప కు, ప్రతి పల్లె పల్లెకు బీఎస్పీ ని తీసుకువెళ్తున్నామన్నారు. ప్రగతి భవన్ కి ఆర్ఎస్పి ని పంపడమే మా అంతిమ లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. బిసి లకు 70 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి అసెంబ్లీ కి పంపడమే బహుజన్ సమాజ్ పార్టీ ఉద్దేశం అన్నారు. బీసీ ఎస్సీ ఎస్టి మైనార్టీ అన్ని వర్గాల వారికి విద్య, వైద్యం, ఉపాధి, అవకాశలు కలిపించడమే తమ పార్టీ ఉద్దేశం అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కోశాధికారి గడ్డం శేషాద్రి స్వేరో, బీఎస్పీ పార్టీ సీనియర్ నాయకులు జనగామ మల్లేష్, కాసార్ల పోషమల్లు,మంథని సెక్టార్ అధ్యక్షులు కాసిపేట రాజ్ కుమార్,ఉపట్ల గ్రామ బూత్ అధ్యక్షులు చాకినారపు లక్ష్మణ్,గ్రామ ఉపాధ్యక్షులు నరేష్,గ్రామ బూత్ కార్యదర్శి సదానందం,బీఎస్పీ పార్టీ కార్యకర్తలు శ్యామ్,శ్రీనివాస్, రాజేష్, శ్రవణ్, రాజశేఖర్,తదితరులు పాలుగోన్నారు.

# చల్మెడ వర్సెస్ చెన్నమనేని

**కరీంనగర్ :**

వేములవాడ బీఆర్ఎస్ ఆధిపత్య పోరు మొదలైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేనికి చెక్ పెట్టేందుకు చల్మెడ పావులు కదుపుతున్నారు. నియోజకవర్గంలో యాక్టివ్ గా ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు వేములవాడలో బీఆర్ఎస్ నేతల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. దీంతో రాజన్న సన్నిధిలో రాజకీయాలు ఆసక్తిగా మారాయి. ఇంతకాలం చక్రం తిప్పిన చెన్నమనేని రమేష్ బాబుకు చెక్ పెట్టేందుకు ప్రయత్నాలు జురుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. వేములవాడలో టికెట్ ఆశిస్తున్న మరో నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు క్యాంప్ కార్యాలయం ప్రారంభించడం చర్చకు దారితీసింది. దీంతో వేములవాడలో చల్మెడ వర్సెస్ చెన్నమనేని రాజకీయం నడుస్తోందని స్థానికులు అంటున్నారు. వేములవాడ మల్లారం క్రాసింగ్ వద్ద చల్మెడ లక్ష్మీ నరసింహారావు క్యాంప్ ఆఫీస్ ను ప్రారంభించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత ప్రభాకర్ రావు క్యాంప్ ఆఫీసును ఓపెన్ చేశారు. వేములవాడ నుంచి చల్మెడ లక్ష్మీనరసింహారావు పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతున్న క్రమంలో ఆయన క్యాంప్ ఆఫీసు ప్రారంభించడం సంచలనం అయింది. ఈ ఆఫీస్ తన వ్యక్తిగతమని ఇక్కడ ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులో ఉంటానని చల్మెడ చెప్తున్నప్పటికీ అసలు కారణం వేరే ఉందని చర్చ మొదలైంది. చల్మెడ బీఆర్ఎస్ లో చేరినప్పటి నుంచీ వేములవాడ నుంచి పోటీ చేస్తారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. కానీ సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబును కాదని మరో నేతకు టికెట్ ఇస్తారా? అన్న అనుమానం కూడా వ్యక్తమైంది. అయితే చల్మెడ మాత్రం తన వ్యక్తిగత ఇమేజ్ పెంచుకుంటూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.చల్మెడ ఆనందరావు ఆసుపత్రి ద్వారా వేములవాడ పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని లక్ష్మీనరసింహారావు తెలిపారు. సేవా కార్యక్రమాలు మరింతగా అందించేందుకు క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. మరోరకంగా అవకాశం ఇస్తే సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నానని లక్ష్మీనరసింహారావు తెలిపారు. అయితే ఈ ఆఫీస్ తన వ్యక్తిగతమన్న ఆయన...పార్టీ కార్యాలయం మాత్రం కాదని తేల్చి చెప్పారు. అధిష్టానం అవకాశం ఇస్తే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వ్యక్తిగత క్యాంప్ ఆఫీసు ఏర్పాటుతో చల్మెడ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆఫీస్ ప్రారంభోత్సవానికి వేములవాడకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కొద్ది కాలంగా వేములవాడలో చల్మెడ లక్ష్మీ నరసింహారావు , ఎమ్మెల్యే రమేష్ బాబు మధ్య టికెట్ కోసం వివాదం కొనసాగుతోంది. ఇద్దరు నేతలు ఎవరికి వారే తనదే టికెట్ అంటూ అనుచరుల వద్ద చెబుతున్నారు. ఇందులో భాగంగా ఎవరికి వారే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఇరువురు అనుచరులు రెండు వర్గాలుగా విడిపోయి విమర్శలు కూడా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చల్మెడ క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించడం మరింత హాట్ టాపిక్ గా మారింది. దీంతో వేములవాడ రాజకీయం మరోసారి వేడెక్కింది.

# ఇంజనీరింగ్ స్టూడెంట్స్ ట్రాన్స్‌ఫర్ కు ఓకే

**హైదరాబాద్ :**

జేఎన్‌టీయూ పరిధిలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు.. ఒక కాలేజీ నుంచి మరొక కాలేజీకి మారేందుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు కళాశాలల మార్పునకు అనుమతిస్తూ జేఎన్‌టీయూ హైదరాబాద్ జూన్ 12న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఒక కాలేజీ నుంచి మరో కాలేజీకి, ఒక యూనివర్సిటీ నుంచి మరో యూనివర్సిటికి, అటానమస్ కాలేజీ నుంచి నాన్ అటానమస్ కాలేజీకి, ఇలా రకరకాల పద్ధతిలో విద్యార్థులకు ట్రాన్స్‌పర్ చేసుకునే అనుమతి కోరుతూ విద్యార్థులు దరఖాస్తు కోరుతారు. స్టూడెంట్ ట్రాన్స్‌ఫర్లు అనేక కారణాలతో ముడిపడి ఉంటాయి. అందులో ప్రధానంగా ఆరోగ్య సమస్యలు కూడా ఉంటాయి. ఇలాంటి సందర్భంలో విద్యార్థుల విద్యా సంవత్సరం నష్టపోకుండా ప్రభుత్వం స్టూడెంట్ ట్రాన్స్‌ఫర్ అయ్యే వెసులుబాటు కల్పించింది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి ఈ ఏడాదిలో స్టూడెంట్ ట్రాన్స్‌ఫర్ల కోసం అనుమతులు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన నిబంధనలు అన్ని అఫిలియేషన్, అటానమస్ కాలేజీలతో పాటు యూనివర్సిటీ కాలేజీలకు కూడా వర్తించనున్నాయి. ఈ నిబంధనలు వెంటనే అమలు చేయాలని యూనివర్సిటీ అకడమిక్ అండ్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారమే స్టూడెంట్ ట్రాన్స్‌ఫర్లు ఉంటాయని ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ తెలిపారు. ఫస్టియర్ నుంచి ఫస్టియర్‌కు రూ.10 వేలు, సెకండియర్ నుంచి సెకండియర్‌కు రూ.15 వేలు, థర్డ్ ఇయర్ నుంచి థర్డ్ ఇయర్‌కు రూ. 20 వేలు, ఫోర్త్ ఇయర్ నుంచి ఫోర్త్ ఇయర్‌కు రూ.25 వేల చొప్పున స్టూడెంట్ ట్రాన్స్‌ఫర్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, ఈ మేరకు కాలేజీ యాజమన్యాలు తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అయితే ఇందుకు సంబంధించిన నిబంధనలు గతేడాది మార్చిలో ప్రభుత్వం జీవో జారీ చేసిన దాని ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధిం చిన పూర్తి వివరాలు జేఎన్టీయూ అధికారిక వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ విభాగంలో పొందుపరిచినట్లు యూనివర్సిటీ అధికారులు పేర్కొన్నారు.

# తొమ్మిదేళ్లైనా ఇంకా అదే ముచ్చట

**అదిలాబాద్ :**

తెలంగాణ సిఎం కేసీఆర్ ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న విద్యుత్ కోతలపై కామెంట్ చేశారు. ఇటీవలి కాలంలో కేసీఆర్ ప్రసంగాల్లో తరచూ ఆంధ్రా ప్రస్తావన చేస్తున్నారు. తాజాగా గద్వాలలో కూడా ఏపీలో విద్యుత్ కోతలంటూ ఎద్దేవా చేశారు. "ఉద్యమ సమయంలో విడిపోతాం అంటే కరెంటు పోతుం దన్నారు. తెలంగాణ చీకటి అవుతుందని మాట్లాడారు. జోగులాంబ గద్వాల నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఆంధ్రా ప్రాంతం ఉంది. తుంగభద్ర వంతెనుకు ఇవతల 24 గంటలు కరెంటు ఉంటుంది. అవతల ఏపీలో ఉండదు.." అని విమర్శించారు. ఇది అందరూ చూస్తున్నారని, దేశంలో తెలంగాణ మాదిరి కరెంటు ఎక్కడా ఇవ్వడం లేదని సోమవారం గద్వాలలో వ్యాఖ్యానించారు .అభివృద్ధి, విద్యుత్ విషయంలో తెలంగాణను ఆంధ్రాతో పోల్చడం మొదటి సారి కాకపోయినా ఇటీవల కేసీఆర్ నోటి వెంట తరచూ ఈ తరహా మాటలు వస్తున్నాయి. కేసీఆర్‌తో పాటు హరీష్ రావు కూడా పదేపదే ఆంధ్రప్రదేశ్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి కారణం ఏమిటనే చర్చ రెండు ప్రాంతాల్లోను సాగుతోంది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అకాంక్షను రగిలించడం మొదలుకుని, తెలంగాణ ప్రాంతంలో ప్రతి ఒక్కరిలో ప్రత్యేక రాష్ట్రం కావాలనే కోరిక రాజేయడంలో కేసీఆర్ అనుసరించిన వ్యూహాన్ని మళ్లీ ప్రారంభించినట్లు కనిపిస్తోంది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు సమీపిస్తున్నాయి. పదేళ్లుగా తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వమే అధికారంలో ఉంది. పదేళ్లలో కనీవిని ఎరుగని స్థాయిలో అభివృద్ధిని సాధించామని కేసీఆర్ చెబుతున్నారు ఆంధ్రప్రదేశ్‌ను టార్గెట్ చేసేలా విమర్శలు గుప్పిస్తున్నారు. 2015లో ముఖ్యమంత్రి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాజధాని వదులుకుని హైదరాబాద్ విడిచి వెళ్లిపోయారు. మరికొద్ది నెలల్లో ఉమ్మడి రాజధాని నిబంధన గడువు కూడా ముగిసిపోతుంది. కేసీఆర్ పదేపదే ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన చేయడం వెనుక పెద్దగా రహస్యం ఏమి లేదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో మళ్లీ పాత విషయాలను ప్రజలకు గుర్తు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఏడాది చివరిలో జరిగే ఎన్నికల్లో తెలంగాణ ప్రజానీకాన్ని తన వెంట ఉంచుకోవడంతో హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా సెటిలర్లను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా సెటిలర్ల ఓట్లన్ని గంపగుత్తగా బిఆర్ఎస్ పార్టీకి పడేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సామాజిక సమీకరణలు, కులాల వారీగా ఓటర్లను ఆకట్టుకోడానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు.ఏపీని విమర్శించడం ద్వారా అక్కడ ఏమి లేదని, తెలంగాణలోనే అభివృద్ధి మెరుగ్గా ఉందనే భావన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న దాదాపు 10లక్షల సెటిలర్లను బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా మలచుకునే ప్రయత్నాల్లో భాగంగానే కేసీఆర్ పదేపదే విమర్శిస్తున్నారనే అనుమానాలు కూడా ఉన్నాయి.హరీష్ రావు విమర్శించినా, కేసీఆర్ తప్పు పట్టినా పాత విషయాలను పదేపదే గుర్తుకు తెచ్చే ప్రయత్నం చేసి, ఆంధ్ర వెనుకబడిందని విమర్శించడం ద్వారా తెలంగాణలో సెంటిమెంట్ ఉపయోగించుకునే ప్రయత్నాల్లో భాగమేనన్నది స్పష్టమవుతోంది. కేసీఆర్ వైపు నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వస్తున్నా ఆంధ్రప్రదేశ్ ముఖ్య నాయకులు ఎవరు పెద్దగా దానిపై మాట్లాడటం లేదు. కేసీఆర్, హరీష్ కామెంట్లకు కౌంటర్ ఇవ్వడం ద్వారా వారికి లబ్ది చేకూర్చడం మినహా ఎలాంటి ప్రయోజనం ఉండదనే ఉద్దేశంతోనే ఏపీ నేతల్ని మాట్లాడొద్దని స్పష్టంగా ఆదేశించినట్లు తెలుస్తోంది.

# బడుగు, బలహీన వర్గాలకోసం పలు కేంద్ర పథకాలు

**బీజేపీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతం**

**విశాఖపట్నం**

భారతీయ జనతా పార్టీ 9వ సంవత్సరాల పాలనలో దేశంలోని బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలను అమలు చేయ డం జరిగిందని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,మాజీ పార్ల మెంటు సభ్యు డు దుష్యంత్ కుమార్ గౌతమ్ అన్నా రు. బీజేపీ 9వ సంవత్సరాల పాలన పూర్తి అయిన సందర్భంగా దేశవ్యాప్తం గా నిర్వహిస్తున్న ప్రవాస్ మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా ఆయ న ఒంగోలు వచ్చారు.మోదీ పరిపాలన లో పేదలకు ఇళ్లు,గ్యాస్ వంటి సౌక ర్యాలను అందించామన్నారు.ప్రపంచ దేశా లలో భారత ఖ్యాతిని ఇనుమ డింపజేయడం జరిగిందన్నారు. సైని కులలో మనోబలాన్ని పెందించామని, సరిహద్దులను పటిష్టం చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రం లో పొత్తులపై మాట్లాడుతూ, ఎన్నికల వేళ పార్టీ పార్ల మెంట రీ బోర్డు దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు.కాంగ్రెస్ పార్టీ హయాంలోపే దలకు జరిగిన అన్యాయం పై వారిపై జరిగిన హత్యలు, అత్యాచా రాలపై తరచూ పోరాటం చేస్తూ వచ్చామ న్నారు. గుంటూరు జిల్లా తెనాలి నియోజక వర్గం కొల్లిపర మం డల పరిధిలోని పిడపర్రు గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు వేమూరి మోహన్ ని మాజీమం త్రులు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనంద బాబు, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యారా వు పరామర్శించారు.జరిగిన దాడిలో గాయప డిన వారిని పరామర్శించి, యోగక్షేమా లు అడిగి తెలుసు కున్నారు.తెనాలి నియోజకవర్గ కొల్లిపర మండల వైసిపి అధ్యక్షుడు చంద్రారెడ్డి అతని కొడుకు దౌర్జన్యం చేస్తున్నారని,దోషులను అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాల ని డిమాండ్ చేశారు.

# అమిత్ షాను కలవనున్న రాజమౌళి

## టాపిక్ రాజకీయమేనా ?

**హైదరాబాద్ :**

తెలంగాణ పర్యటనకు వస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షాను.. ప్రముఖ దర్శకుడు రాజమౌళి కలవనున్నారు. వీరిద్దరి భేటీ రాజకీయంగా ఆసక్తికరంగా మారుతోంది. రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ను బీజేపీ రాజ్యసభకు నామినేట్ చేసింది. అదే సమయంలో ఆయన రజాకార్ ఫైల్స్ పేరుతో సినిమాలు తెరకెక్కిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. గతంలో ట్రిపుల్ ఆర్ సినిమా ఆస్కార్ గెలుచుకున్న సందర్భంగా.. అమిత్ షా హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు ఓ స్టార్ హోటల్‌లో విందు ఇచ్చేలా షెడ్యూల్ ఖరారైంది. కానీ తీరిక లేని షెడ్యూల్ కారణంగా ఆ విందు భేటీ రద్దయింది. ఈ సారి రాజమౌళి ఒక్కరే అమిత్ షాతో భేటీ అయ్యే అయ్యే అవకాశం ఉంది. అమిత్ షా ఏ రాష్ట్రానికి వెళ్లిన సంపర్క్ ఫర్ సమర్థన్ పేరుతో కొంత మంది ప్రముఖుల్నికలిసి బీజేపీకి మద్దతివ్వాలని కోరుతారు. అందులో భాగంగానే రాజమౌళితో సమావేశం కానున్నట్లుగా చెబుతున్నారు. ప్రధాని మోడీ 9ఏళ్లలో చేసిన అభివృద్ధిని మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 15న ఖమ్మంలో బీజేపీ అగ్రనేత అమిత్ షా బహిరంగసభ నిర్వహించనున్నారు. ఆయన పర్యటన షెడ్యూల్‌ను తెలంగాణ బీజేపీ విడుదల చేసింది. ఈ నెల 15న భద్రాచలంలో రాములవారి దర్శనంతో అమిత్ షా తన తెలంగాణ పర్యటనను ప్రారంభిస్తారు. ముందుకు ఈ నెల 15న ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు అల్పాహార సమావేశంలో భాగంగా బీజేపీ రాష్ట్ర ముఖ్యనేతలతో పలు అంశాలను చర్చిస్తారు. మధ్యాహ్నం 1.10 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుంచి భద్రాచలానికి బయల్దేరి వెళతారు. ద్రాచలం చేరుకున్న తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.20 మధ్యలో రామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో బీజేపీ బహిరంగసభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. బహిరంగసభ ముగిసిన తర్వాత సాయంత్రం 6 గంటలకు తిరిగి శంషాబాద్‌కు వచ్చి రాత్రి 7 గంటలకు పలువురు నేతలతో వేర్వేరుగా సమావేశమవుతారు. ఈ సమయంలోనే రాజమౌళితో పాటు మరికొంత మంది ప్రముఖులతో సమావేశాలు ఉంటాయని చెబుతున్నారు. తిరిగి రాత్రి 9.40 గంటలకు శంషాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళతారు.

బలం లేదన్న చోటే బలనిరూపణకు వ్యూహం..

ఖమ్మం గుమ్మంలో నిర్వహించే సభపై బీజేపీ బోలెడన్ని ఆశలు పెట్టుకుంది. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగడానికి ఈ సభ టర్నింగ్ పాయింట్‌గా ఉండాలని లెక్కలేసుకుంటోంది. జిల్లాలో పార్టీ ఉనికి లేదు.. కనీస స్థాయిలోనైనా కార్యకర్తలు లేరన్న విమర్శలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఎక్కడైతే ఆదరణ లేదన్న ఆరోపణలు ఉన్నాయో..ఖమ్మం గుమ్మంలో నిర్వహించే సభపై బీజేపీ బోలెడన్ని ఆశలు పెట్టుకుంది. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగడానికి ఈ సభ టర్నింగ్ పాయింట్‌గా ఉండాలని లెక్కలేసుకుంటోంది. జిల్లాలో పార్టీ ఉనికి లేదు.. కనీస స్థాయిలోనైనా కార్యకర్తలు లేరన్న విమర్శలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఎక్కడైతే ఆదరణ లేదన్న ఆరోపణలు ఉన్నాయో.. అక్కడే లక్షమందితో సభ నిర్వహించి కమలం తడాఖా చూపించాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ సభతో మొదలుపెట్టి రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి బలోపేతం కావాలని బీజేపీ టార్గెట్‌గా పెట్టుకుంది.బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్రతో పార్టీకి మంచి మైలేజ్ వచ్చింది. కాంగ్రెస్‌తో పోలిస్తే గ్రాఫ్ పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఆ తర్వాత నిరుద్యోగుల తరఫున నిరసనలు, టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీతో ఆందోళనతో నేతలు జనం బాటపట్టారు. అంతా బాగానే ఉందనుకున్న టైమ్‌లో.. కర్నాటకలో ఎన్నికలతో నేతలంతా అక్కడ మకాం వేశారు. దీంతో తెలంగాణలో యాక్టివిటీ తగ్గింది. అదే సమయంలో అక్కడ బీజేపీ పరాజయంతో.. ఇక్కడ పార్టీ కార్యకలాపాలు ఒక్కసారిగా అగిపోయాయి.నిజానికి కర్నాటక రిజల్ట్‌తో పార్టీ శ్రేణుల్లో ఆందోళన మొదలైంది. దీనికి తోడు రాష్ట్ర నాయకత్వంలో విభేదాలు తెరపైకి వస్తున్నాయి. అంతేకాకుండా అధ్యక్షుడ్ని మారుస్తారన్న టాక్ కూడా వినిపిస్తోంది. వీటన్నింటికి ఖమ్మం సభతో చెక్ పెట్టాలని అగ్రనాయకత్వం భావిస్తోంది. తెలంగాణలో అగ్రనేతల పర్యటనలు వరుసగా ఉండేలా ప్లాన్ చేసినట్టు స్పష్టమవుతోంది.

# మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి పరామర్శ

## మంథని మండలంలో పర్యటన

**మంథని**

బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పార్లమెంటు కన్వీనర్ పి. మల్లికార్జున్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డిలతో కలసి పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. మంథని మండలం చిన్న ఓదాల గ్రామంలో బీజేపీ యువ నాయకులు చిట్టవేణి హరీష్ మాతృమూర్తి లక్ష్మి అనారోగ్యం తో బాధ పడుతుండగా వారిని వివేక్ వెంకటస్వామి తో పాటు బిజెపి నాయకులు పరామర్శించి,ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, మంథని పట్టణ అధ్యక్షులు ఎడ్ల సదశివ్, ఎస్సి మోర్చా జిల్లా కార్యదర్శి కాసిపేట మల్లేష్, సీనియర్ నాయకులు కొండపాక సత్యప్రకాష్,బోగోజు శ్రీనివాస్,రాపర్తి సంతోష్, బూడిద తిరుపతి, పబ్బ తిరుపతి, ఎడ్ల సాగర్, పార్వతి విష్ణు, మాటేటి రాజబాబు,తదితరులు పాల్గొన్నారు.

# పేద మహిళలకు ఉచిత టైలరింగ్ సెంటర్

**బద్వేలు**



బద్వేల్ పట్టణం త్యాగరాజ నగర్ కాలనీలో బుధవారం ఉచిత టైలరింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు టైలరింగ్ సెంటర్ ను రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు బీసీ రమణ ప్రారంభించారు సంఘమిత్ర సంస్థ అధ్యక్షులు సొద్దల పెంచలయ్య మాట్లాడుతూ ఒంటరి మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ఆర్థికంగా ఎదుగుటకు టైలరింగ్ శిక్షణను నేర్చుకోవాలని అన్నారు మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజంలో గౌరవంతో బ్రతకొచ్చని పెంచలయ్య అన్నారు దళిత నాయకులు ఓ ఎస్ వి ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణలో మహిళలందరూ క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకుని సంఘమిత్ర సంస్థ కి కుటుంబ సభ్యులకి మంచి పేరు తేవాలని కోరారు సంఘమిత్ర లో సభ్యులై సమస్త సహకారంతో మహిళలు అన్ని విధాల ఎదగాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో సంఘమిత్ర సంస్థ కోఆర్డినేటర్ ఎస్కే జహీరా ఆస్మా డైరెక్టర్ ఆర్ సి సుబ్బారెడ్డి 30 మంది కుట్టు శిక్షణ మహిళలు పాల్గొన్నారు

# క్యాస్ట్ సర్టిఫికెట్ల కోసం... కొట్లాటలు

**నిజామాబాద్ :**

మండుటెండల్లో పిల్లల కుల, ఆదాయ, స్థానిక ధ్రువ పత్రాల కొరకు రెవెన్యూ కార్యాలయాలలో పిల్లలు ఉదయం పది గంటల నుంచి బారులు తీరి అధికారుల కొరకు ఎదురు చూసినా మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా రాకుంటే ఎలాగా..? 3, 4, రోజులైనా సర్టిఫికెట్లు పరిశీలన చేసి ఇవ్వడం లేదు. మీసేవ లో మరో ఇబ్బంది. మరో దిక్కు పోలీసుల నియామకం వారికి సంబంధించిన ధ్రువపత్రాలు ఇవ్వాలి. అధికారులు ఎమ్మార్వో లు వారి కింది స్థాయి ఉద్యోగులు ఏం చేస్తున్నట్లు? వారిని ఎవరు అడగాలి? ఈ విషయంపై కలెక్టర్లు స్పందించక పోతే రక రకాల గొడవలు జరుగుతాయి. వీరికి మూమెంట్ రిజిస్టర్ లేదా ఎవరు రోజుకు ఎన్ని ఫైల్స్ డిస్పోజ్ చేశారని అడిగేవారు లేరా? అధికారులు ఆఫీస్లలో ఉండి కూడా పని చేయక పోతే ఎవరిది పొరపాటు? పని చేయక పోతే అడిగే హక్కు అధికారం ప్రజలకు ఉంది సిబ్బంది పని చేయకపోతే చర్య తీసుకునే అధికారం కలెక్టర్లకు ఉంది, తాత్కాలిక అదనపు సిబ్బందినైనా ఏర్పాట్లు చేసి ఆ కొరత, పబ్లిక్ అవసరాలు తీర్చే ఏర్పాటు చేయాలినిన్నటి వరకు పరీక్షలు, ఈవెంట్స్ అంటూ కుస్తీ పట్టిన పోలీస్ క్వాలిఫైడ్ అభ్యర్థులకు మరో సమస్య వచ్చిపడింది. కష్టపడి చదివి క్వాలిఫై అయిన సంతోషం కొంచెం కూడా లేకుండా చేస్తోంది. క్వాలిఫై అవ్వడం వరకు ఒక ఎత్తయితే.. కొలువులో చేరేందుకు చివరి దశ అయిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ మరో ఎత్తుగా మారింది. సర్టిఫికెట్ల కోసం నానా తిప్పలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు డబ్బులిస్తే కానీ సర్టిఫికెట్లు ఇచ్చేదిలేదని తెగేసి చెబుతున్నాయి. దీంతో క్వాలిఫై అయిన అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారు. ఇంత వరకు వచ్చాక ఉద్యోగాన్ని వదులుకోవాల్సిందేనా అని డైలమాలో పడ్డారు. కొందరూ చేసేదేమి లేక తెలిసిన వారి దగ్గర అప్పులు చేసీ మరీ డబ్బులు కట్టడానికి సిద్ధమయ్యారు. మరి కొందరు కాలేజీల యాజమాన్యాలను వేడుకుంటున్నారు.పోలీసు నియామకాల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ రేపటి నుంచి జరుగుతుండడంతో ఈ అభ్యర్థులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడ్డారు. ముఖ్యంగా కానిస్టేబుల్ క్వాలిఫై అభ్యర్థులు డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ చేస్తున్నారు. ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు అని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఎస్సై క్వాలిఫై అభ్యర్థుల సమస్య మరో విధంగా ఉన్నది. వారివి డిగ్రీలు అయిపోయాయి. వారు కాలేజీల్లో చెల్లించాల్సిన పెండింగ్ ఫీజులు అలాగే ఉండటంతో సర్టిఫికెట్లు అభ్యర్థులకు ఇవ్వడం లేదు. నియామకాల్లో వెరిఫికేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి తర్వాత వాటిని కాలేజీకి అప్పగిస్తామని అభ్యర్థులు యాజమాన్యాలను వేడుకుంటున్నారు. అయిన కూడా యాజమాన్యాలు విద్యార్థుల విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా నివాస ధృవీకరణ పత్రం కోసం సైతం రెవెన్యూ అధికారులు పోలీస్ క్వాలిఫై అభ్యర్థులకు చుక్కలు చూపిస్తున్నారు. దరఖాస్తులు అందించడంలో జాప్యం చేస్తున్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ దగ్గర పడుతుండడంతో సమయానికి వివిధ జిల్లాల్లోని రెవెన్యూ అధికారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అభ్యర్థులు వారి పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రంలోనే అప్లికేషన్ ఎడిటింగ్/మాడిఫై చేసుకునే అభ్యర్థులకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ద్వారా మార్కుల వెయిటేజీ పొందాలనుకుంటున్న అభ్యర్థులు ఆర్టీఏ ధ్రువీకరించిన సర్టిఫికెట్లను చూపించాలి. వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు కుల ధ్రువీకరణ, బీసీ అభ్యర్థులు నాన్ క్రీమిలేయర్, ఈడబ్ల్యూఎస్, ఏజెన్సీ ఏరియా సర్టిఫికెట్లు ఒరిజినల్స్, జిరాక్స్‌ల సెట్ తప్పనిసరిగా తీసుకొనిరావాలని అధికారులు తెలిపారు. వీటితోపాటుగా ఇంటిమేషన్ లెటర్, ట్రాన్సాక్షన్ ఫాం, పార్ట్–2 అప్లికేషన్ ప్రింట్ అవుట్, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, వయసు, లోకల్, రిజర్వేషన్, ఏజ్ రిలాక్సేషన్ సర్టిఫికెట్లు, ఫోటోలు, మెమోలు, డ్రైవింగ్ లైసెన్స్, హారిజంటల్ రిజర్వేషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.

# డెక్కన్ క్రానికల్ ప్రమోటర్లకు ఈడీ బిగ్ షాక్

**హైదరాబాద్ :**

డెక్కన్ క్రానికల్ ప్రమోటర్లకు ఈడీ బిగ్ షాక్ ఇచ్చింది. మనీ లాండరింగ్ కేసులో విచారణకు ఏమాత్రం సహకరించకపోవడంతో వెంకట్రామ్ రెడ్డి సహా మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. ఈ ముగ్గుర్నీ కాసేపట్లో ఈడీ కోర్టులో హాజరుపరచనుంది. 8వేల కోట్ల రూపాయల బ్యాంక్ ఫ్రాడ్ కేసులో ఈడీ అభియోగాలు మోపింది. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరులో డెక్కన్ క్రానికల్‌కు చెందిన 363 కోట్ల రూపాయల విలువ చేసే 14 ఆస్తుల్ని అటాచ్ చేసింది. అలాగే డెక్కన్ క్రానికల్ స్కామ్ పై ఆరు ఎఫ్ఐఆర్ లు నమోదు చేసింది ఈడీ. వెంకట్రామిరెడ్డి అప్పుల పర్వం 2005లో మొదలైంది. ఆ తర్వాత 2009-11 మధ్య వందల కోట్ల రూపాయలు వేర్వేరు బ్యాంకుల నుంచి ఆయన సంస్థ డీసీహెచ్ఎల్ అప్పులు చేసింది.వెంకట్రామిరెడ్డి తమను మోసగించారంటూ 2013లో కెనరా బ్యాంక్ సీబీఐకి ఫిర్యాదు చేసింది. వేర్వేరు బ్యాంకుల్లో ఒకే ఆస్తిని తనఖా పెట్టినట్టు ఫిర్యాదులో వివరించింది. కెనరా బ్యాంక్ కేసు ఫిర్యాదుతో.. రుణాలు సొంతానికి వాడుకున్నారని సీబీఐ కేసు నమోదు చేసి అరెస్ట్ కూడా చేసింది. సీబీఐ కేసు ఆధారంగా ఈడీ కూడా ఎంటర్ అయింది. గతంలో 3,300 కోట్లకుపైగా వెంకట్రామిరెడ్డి ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ? పెద్ద మొత్తంలో రుణాలు దారి మళ్లించినట్లు అభియోగాలు మోపింది.అయితే మొదట్లో విచారణకు హాజరైన వెంకట్రామి రెడ్డి అండ్ కో ఆ తర్వాత విచారణకు డుమ్మా కొట్టింది. ఈ క్రమంలోనే మరోసారి విచారణకు పిలిచింది. విచారణకు ఏమాత్రం సహకరించకపోవడంతో వెంకట్రామిరెడ్డితో పాటు పీకే అయ్యర్, మని ఓమెన్‌లను అరెస్ట్ చేసింది.

# నైజీరియాలో ప్రమాదం...100 మంది దుర్మరణం

**హైదరాబాద్ :**

నైజీరియాలో ఘోర ప్రమాదం జరిగింది. ఓ పడవ మునిగిపోయి దాదాపు 103 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చిన్నారులూ ఉన్నారు. పడవ ఓవర్‌లోడ్ అవడం వల్ల నది మధ్యలో బోల్తా పడిపోయింది. రెస్క్యూ టీమ్‌తో పాటు పోలీసులు...గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. ఇప్పటి వరకూ 100 మందిని గుర్తించి రక్షించినట్టు అక్కడి అధికారులు వెల్లడించారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గల్లంతైనట్టు తెలుస్తోంది. ఓ పెళ్లికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో పడవలో దాదాపు 5 గ్రామాలకు చెందిన ప్రయాణికులున్నారు. క్వారా రాష్ట్రంలోని నదిలో పడవ బోల్తా పడింది. దీనిపై ఆ రాష్ట్ర గవర్నర్ స్పందించారు. "పడవ మునిగిపోయిన ఘటనలో ఇంకా చాలా మందిని గుర్తించాల్సి ఉంది. ప్రాణాలతో బయట పడిన వాళ్లు ఇంకా ఆ ప్రమాదాన్ని తలుచుకుని భయపడ పోతున్నారు. చాలా మంది తమ బంధువులను పోగొట్టుకున్నారు. రాత్రి ఓ వెడ్డింగ్ పార్టీకి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

# పైళ్ల ఆఫీసు, కార్యాలయంలో ఐటీ సోదాలు

**హైదరాబాద్ :**

భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఇల్లు, కార్యాలయంలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ నేత, భువనగిరి ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి నివాసం, ఆఫీసుల్లో సోదాలు జరుగుతున్నాయి. ఆయనతోపాటు బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఇంట్లో కూడా ఐటీ సోదాలు చేస్తోంది. అధికార పార్టీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేల నివాసాల్లో ఐటీ సోదాలు కలకలం రేపుతున్నాయి. వీళ్లిద్దరి కంపెనీల్లో ఉదయం నుంచి ఐటీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న తెలంగాణ రాజకీయం ఇప్పుడు మరోసారి హీట్ ఎక్కింది. గురువారం అమిత్‌షా తెలంగాణలో పర్యటించనున్నారు. ప్రముఖులతో సమావేశం కానున్నారు. ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికార ఒప్పందం కుదిరిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ టైంలో సడెన్‌గా జరిగిన ఐటీ రైడ్స్ తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధుల ఇళ్లు, ఆఫీస్‌లు, వారి బంధువుల, సహచరుల నివాసాలపై కూడా ఐటీ కన్నేసింది. ఈ ఉదయం నుంచి మూకుమ్మడిగా సైలెంట్‌గా అధికారులు అటాక్ చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన కొత్త ప్రభాకర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి ఇంట్లో సోదాలు జరుగుతున్నాయి. ఇళ్లు, కంపెనీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో తనిఖీలు చేస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు ప్రజాపతినిధులపై జరుగుతున్న ఐటీ రైడ్స్ తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారాయి. కొత్త ప్రభాకర్ రెడ్డి మెదక్ ఎంపీగా ఉన్నారు. ఆయన ఇంట్లో వేకువజాము నుంచే తనిఖీలు ప్రారంభించారు. కొండాపూర్‌లోని లుంబిని ఎస్ఎల్ఎన్ స్ప్రింగ్స్ విల్లాస్‌లో ఎంపీ ఉంటున్నారు. ఆయన ఇంటితోపాటు ఆఫీసుల్లో కూడా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. పైళ్ల శేఖర్ రెడ్డి యాదాద్రి జిల్లాలో భువనగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన నివాసం, కంపెనీల్లో కూడా తనిఖీలు చేపట్టింది ఐటీ శాఖ. భువనగిరి, హైదరాబాద్ కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలానీలోని ఆఫీస్, హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్ లిమిటెడ్‌లతోపాటు మొత్తం 12 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి.

ఈ రెండు కంపెనీలకు శేఖర్ రెడ్డి భార్య వనిత డైరెక్టర్‌గా ఉన్నారు. ఒక్క ఎమ్మెల్యే నివాసాలు, బంధువుల ఇళ్లు, ఆఫీస్‌లపై సోదాల కోసమే 30 టీంలు పని చేస్తున్నాయి. మర్రి జనార్ధన్ రెడ్డి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనకు చెందిన షాపింగ్ మాల్‌పై ఐటీ శాఖ గురిపెట్టింది. కేపీహెచ్‌బీ కాలనీలోని జేసీ బ్రదర్స్‌లో ఐటీశాఖ రైడ్స్ చేసింది. ఉదయం 6 గంటల నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. హిల్ ల్యాండ్ టెక్నాలజీస్ కంపెనీ, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్‌లో సహా పలు కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. మొత్తం 70 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి.. 12 చోట్ల ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఆయన ఇల్లు, ఆఫీసుల్లో ఇవాళ ఉదయం నుంచి తనిఖీలు జరుగుతున్నాయి.


అలాగే శేఖర్ రెడ్డి సిబ్బంది ఇంట్లో కూడా సోదాలు జరుపుతున్నారు.ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి భార్య వనితా హిల్ ల్యాండ్ టెక్నాలజీస్, మెయిన్ ల్యాండ్ డిజిటల్ టెక్నాలజీస్ కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. కొత్తపేట, గ్రీన్ హిల్స్ కాలనీలో ఉన్న కార్యాలయాలతో పాటు భువనగిరిలోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఐటీ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో ఎమ్మెల్యే నివాసంలో తనిఖీలు చేస్తున్నారు. దీంతో ఆ వ్యాపార నగదు లావాదేవీలకు సంబంధించి ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు.తీర్థ గ్రూప్ పేరుతో రియల్ ఎస్టేట్, మైనింగ్, సోలార్ ఎనర్జీ, లిథియం బ్యాటరీల వ్యాపారాలు చేస్తున్నారు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి. హైదరాబాద్‌తో పాటు కర్నాటకలో పలు రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులను తీర్థ గ్రూప్ పూర్తి చేసింది. సౌత్ ఆఫ్రికాలోనూ తీర్థ గ్రూప్ మైనింగ్ వ్యాపారం చేస్తోంది. దీంతో ఐటీ అధికారులు ఐటీ చెల్లింపుల అవకతవకలపై ఆరా తీస్తున్నారు.శేఖర్ రెడ్డిపై జరుగుతున్న ఐటీ దాడులతో బీఆర్ఎస్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఆయన అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఈ తనిఖీలతో టెన్షన్ మొదలైంది.

# ఏపీ ఈపీసెట్ ఫలితాలు విడుదల

**విజయవాడ :**

ఏపీ ఈఏపి సెట్ 2023 ఫలితాలను మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో విడుదల చేశారు. జేఎన్టీయూ అనంతపురం ఈ సెట్‌ను నిర్వహించింది. గత నెల 15 నుంచి 24 వరకు ఏపీ ఇంజినీరింగ్ , అగ్రికల్చర్ ఫార్మసీ అడ్మిషన్‌ల కోసం ఎంట్రన్స్ పరీక్షలు విద్యార్థు రాశారు.మే 15 నుంచి 19 వరకు ఇంజినీరింగ్ స్ట్రీమ్, మే 22, 23 తేదీల్లో అగ్రికల్చర్/ఫార్మసీ విభాగాలకు పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలకు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 3.15 లక్షల మందికి (93.38 శాతం) పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇంజినీరింగ్ విభాగంలో 2,24,724 మంది; ఫార్మసీ, అగ్రికల్చర్ విభాగాల్లో 90,573 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను మే 24న విడుదల చేశారు. అదేవిధంగా మే 24 నుంచి 26 వరకు ఆన్సర్ కీపై అభ్యంతరాలు స్వీకరించారు. ఇంజినీరింగ్ ఎంట్రన్స్ కోసం 2 లక్షల 38 వేల 180 మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందులో బాలికలు 1 లక్ష 69 వేల 302 మంది ఈ విభాగంలో మొదటి పది ర్యాంకుల్లో అబ్బాయిలే సత్తా చాటారు. ఇంజినీరింగ్‌లో మొదటి పది ర్యాంకర్‌లుచల్లా ఉమేష్ వరుణ్- 158 మార్కులు అభినవ్ చౌదరి- 157 మార్కులు నండిపాటి సాయి దుర్గా రెడ్డి -155 మార్కులుచింతపాటి బాబు సృజన్ రెడ్డి- 155మార్కులుదుగ్గినేని వెంకట యోగేష్- 150 మార్కులుఅడగడ్డ వెంకట శివరాం - 153 మార్కులుఎక్కింటి ఫణి వెంకట మనిచంద్రా రెడ్డి 153 మార్కులుమెడపురం లక్ష్మి నరసింహ భరద్వాజ్ 153 మార్కులుశశాంక్ రెడ్డి- 152 మార్కులుఎం శ్రీకాంత్- 152 మార్కులుఅగ్రికల్చర్‌లోటాప్ ర్యాంకర్లుసత్యరాజ జశ్వంత్ (కాతేరు)వరుణ్ చక్రవర్తి (శ్రీకాకుళం)రాజ్‌కుమార్ (సికింద్రాబాద్)సాయి అభినవ్ (చిత్తూరు)కార్తికేయరెడ్డి (తెనాలి)

# ఎన్నికలకు సిద్ధమంటున్న పార్టీలు


**విజయవాడ :**

ఏపీ రాజకీయాలలో కీలక ఘట్టం ప్రారంభమైంది. ఒకరకంగా చెప్పాలంటే ఈ ఘట్టం వచ్చే అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల ప్రచార పర్వానికి పరోక్షంగా శ్రీకారం చుట్టబోతోందని చెప్పాలి. ఎన్నికలు ఇంకా సుదూరంలో ఉండగానే వారాహి విజయ యాత్ర పేరిట జనసేన అధిపతి పవన్ కళ్యాణ్ ప్రచార పర్వానికి శ్రీకారం చుడుతున్నారు. నిజానికి అసెంబ్లీ సమావేశాలకు దూరమైన తర్వాత తెలుగుదేశం పార్టీ కీలక నేత నారా లోకేష్ ప్రజల్లో మమేకం అవ్వడమే మార్గమని భావించారు. దానికి అనుగుణంగా జనవరి చివరి వారంలో సుదీర్ఘ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. గత ఐదు నెలలుగా నారా లోకేష్ పాదయాత్ర రాయలసీమ ప్రాంతంలో కొనసాగి తాజాగా దక్షిణ కోస్తాలోని నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించింది. దాదాపు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని మొత్తం 175 నియోజకవర్గాల్లో తన పాదం మోపేలా లోకేష్ పాదయాత్ర రోడ్డు మ్యాప్ రెడీ చేసుకుని మరీ ప్రారంభించారు. అలా దాదాపు 5 నెలలపాటు రాయలసీమలోని ప్రతి మండలాన్ని స్పృశించారు నారా లోకేష్ అదొక వైపు కొనసాగుతుండగానే వివిధ సందర్భాలు పలు అంశాలు తెరమీదికి వచ్చినప్పుడు ఒకవైపు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, ఇంకొక వైపు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జిల్లాల్లో పర్యటిస్తూనే ఉన్నారు ఇప్పటిదాకా ఒక ఎత్తు ఇకపై మరొక ఎత్తు అన్న విధంగా ఇప్పుడు జనసేన అధినేత వారాహి విజయ యాత్రకు పూనుకున్నారు. విడతల వారీగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను కవర్ చేసేలా పవన్ కళ్యాణ్ రోడ్ మ్యాప్ రెడీ అయినట్టు జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అంటే నిర్ణీత సమయం ప్రకారం ఎన్నికలు జరిగితే అసెంబ్లీ ఎలక్షన్స్‌కి ఇంకా పది నెలల గడువుంది. ఒకవేళ కొంతమంది ఊహిస్తున్నట్లు 2023 ఏడాది చివరిలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు వస్తే దానికి అనుగుణంగా ప్రచార పర్వాన్ని పరుగులు పెట్టించే రకంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లుగా కనిపిస్తుంది. అత్యంత పటిష్టంగా రూపొందించిన బుల్డోజర్ లాంటి వారాహి వాహనానికి తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు జనసేనాని. వారాహి విజయ యాత్ర ప్రారంభానికి ముందు అమరావతి పరిధిలో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో రెండు రోజులపాటు యజ్ఞ యాగాదులను కూడా పవన్ కళ్యాణ్ నిర్వహించడం విశేషం. మునుముందు ఎలాంటి అవరోధాలు లేకుండా ఒకవైపు తన విశ్వాసాల మేరకు యజ్ఞాలు నిర్వహిస్తూనే.. ఇంకొక వైపు పార్టీలో ఉన్న అనుభజ్ఞుల మేరకు వ్యూహాత్మకంగా యాత్ర రోడ్ మ్యాప్ రెడీ చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ తాను మొదటి నుంచి ప్రస్తావిస్తున్నట్లు తన సామాజిక వర్గాన్ని ముందుగా ఆకర్షించేందుకు చాలా రోజులుగా పవన్ కళ్యాణ్ ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు వారాహి విజయ యాత్ర కూడా వ్యూహాత్మకంగా ఉభయ గోదావరి జిల్లాలలో నిర్వహించబోతున్నారు. అన్నవరం సత్యదేవుని సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించి యాత్రకు శ్రీకారం చుట్టారు. సుమారు పది రోజులపాటు ఒక్కో నియోజకవర్గంలో రెండు రోజులపాటు పవన్ కళ్యాణ్ యాత్ర కొనసాగబోతోంది ఉదయం షెడ్యూలులో రైతులతోనూ, యువతతోను సంభాషించబోతున్నారు. మధ్యాహ్నం తర్వాత పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించబోతున్నారు. సాయంత్రానికి ఒకరోజు స్ట్రీట్ మీటింగ్స్.. ఇంకొకరోజు బహిరంగ సభలను నిర్వహించేలా ప్రణాళిక రచించారు జనసేన వ్యూహకర్తలు. జూన్ 21న గాని, 23న కానీ అమలాపురం కేంద్రంగా భారీ బహిరంగ సభకు జనసేన ప్లాన్ చేసింది. మధ్యలో బ్రేక్ తీసుకుంటూ విడతల వారీగా రాష్ట్రవ్యాప్తంగా పవన్ కళ్యాణ్ పర్యటన కొనసాగబోతున్నట్లు తెలుస్తోంది. అయితే తెలుగుదేశం పార్టీతో పొత్తు దాదాపు ఖరారు అయిన నేపథ్యంలో సీట్ల సర్దుబాటు విషయం కీలకంగా నుండి ఈ నేపథ్యంలోనే జనసేనకు పట్టున్న నియోజకవర్గాలను గుర్తించి దానికి అనుగుణంగా టిడిపి, బిజెపిలతో బేరసారాలకు సమాయత్తం కావాలని జనసేనాని భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ సైతం ముందస్తు ఎన్నికలను అంచనా వేస్తోంది. దానికి అనుగుణంగా అధినేత చంద్రబాబు జిల్లాలలో పర్యటిస్తున్నారు. గత ఐదు నెలలుగా టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రజల్లో సంచరిస్తున్నారు. పలు దఫాలలో ఆయన అధికార వైసీపీ నేతలకు సవాళ్లు విసిరారు. పనిలో పనిగా వైయస్ జగన్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. ముందస్తు ఎన్నికలు వస్తే ఎలాంటి వ్యూహాలను అమలు చేయాలనే విషయంలో చంద్రబాబు అమరావతి కేంద్రంగా వ్యూహరచన చేస్తున్నారు. జిల్లాల వారీగా పార్టీ సీనియర్ నాయకులను సమయత్తపరుస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తూనే వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలకుండా చూసుకునే జాగ్రత్త పాటిస్తున్నారు చంద్రబాబు. ఇందులో భాగంగా జనసేనతో కలవబోతున్న సంకేతాలను చాలా కాలంగా ఇస్తున్నప్పటికీ తాజాగా ఉన్నట్టుండి న్యూఢిల్లీ వెళ్లి బిజెపి అగ్ర నేత అమిత్ షా తో భేటీ అయి రావడం ఏపీ రాజకీయాలలో కలకలం రేపింది. చాలా కాలంగా బిజెపి అధినాయకత్వాన్ని కలవాలని చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నప్పటికీ సాధ్యపడలేదు. తాజాగా జరిగిన భేటీకి ఎవరు చొరవ చూపారు అన్న విషయం పక్కన పెడితే బిజెపి-టిడిపి దగ్గర కాబోతున్నాయన్న సంకేతాలు చంద్రబాబు-అమిత్ షా-జెపి నడ్డాల సంయుక్త భేటీ తర్వాత బలపడ్డాయి. మునుముందు ఏపీలో టిడిపి-జనసేన-బిజెపి కలిసి కూటమిగా మారబోతున్నాయి అన్నది దాదాపు ఖరారు అయ్యింది. తాజాగా ముఖ్యమంత్రి వైయస్ జగన్ చేసిన కామెంట్స్ కూడా ఇందుకు దోహదపడ్డాయి. పార్టీ శ్రేణులకు సందేశం ఇచ్చిన జగన్ మనకు అండగా బిజెపి కూడా రాకపోవచ్చు అని సెలవిచ్చారు. తద్వారా ఏపీలోని అన్ని రాజకీయ పక్షాలను ఒంటిచేత్తో ఎదుర్కొంటానన్న ధీమాను జగన్ వ్యక్తం చేశారు. నిజానికి విపక్ష పార్టీలు ప్రజా సమస్యలను, ప్రభుత్వ వైఫల్యాలను తీసుకొని జిల్లాల్లో పర్యటిస్తూ ఉంటే అధికార పార్టీ గత నాలుగు సంవత్సరాలలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకుని వెళుతుంది. వారంలో కనీసం రెండు కొత్త పథకాలను ప్రారంభిస్తూ.. ఆ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఉద్దేశించి ప్రసంగిస్తూ తనను మరోసారి ఆశీర్వదించాలని వైయస్ జగన్మోహన్ రెడ్డి కోరుతున్నారు. మరోవైపు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు తరచూ పత్రికా సమావేశాలను నిర్వహించి గత నాలుగేళ్ల అభివృద్ధి అంశాలను వెల్లడిస్తున్నారు. తద్వారా ప్రజలకు తాము సాధించిన ప్రగతిని వివరించి మరోసారి ఎన్నికల్లో విజయం తనకే కట్టబెట్టాలని ప్రజలను కోరే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పక్షాలు ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే పొలిటికల్ హీట్ పుట్టిస్తున్నాయి. కొందరు ఊహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు జరిగితే దానికి అనుగుణంగా ఆల్మోస్ట్ అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నట్లు అవగతం అవుతోంది. మరి ముందస్తు ఎన్నికలు వస్తాయా లేక సార్వత్రిక ఎన్నికలతో పాటే ఏపీ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతాయా అన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

# శిరీషది హత్యేనని తేల్చిన పోలీసులు

**హైదరాబాద్ :**

తెలంగాణ వ్యాప్తంగా సంచలనం రేపిన వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామానికి చెందిన 19 ఏళ్ల శిరీష మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఇంట్లో జరిగిన గొడవనే హత్యకు కారణం అని పోలీసులు తేల్చారు. మద్యం మత్తులో శిరీష బావ, అతని ఇద్దరు స్నేహితుల సాయంతో హత్య చేసినట్లు గుర్తించారు. శిరీష చనిపోయినప్పటి నుంచి గ్రామస్థులంతా అది హత్యేనని చెప్పగా.. పోలీసులు శిరీష ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావించారు. కానీ చివరకు అసలు నిజం వెలుగులోకి వచ్చింది. మూడ్రోజులుగా శిరీష బావ అనిల్ నోరు మెదపడం లేదు. ఈక్రమంలోనే పోలీసులు అనిల్ కాల్ డేటాను పరిశీలించి.. విచారణ చేపట్టారు. శిరీష ఫోన్ స్విచ్ఛాఫ్ అయినప్పటి నుంచి అనిల్ ఎక్కువగా మాట్లాడిన అతడి ఇద్దరి స్నేహితులను అదుపులోకి తీసుకొని విచారించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. శిరీష చెప్పిన మాట వినడం లేదని.. ఎప్పుడూ ఫోన్ చూస్తూనే ఉంటుందని శిరీషతో అనిల్ గొడవ పడ్డాడు. అయితే బావతో వాదించడం ఇష్టం లేని ఆమె.. మరో గదిలోకి వెళ్లి ఆత్మహత్యాయత్నం చేసుకోబోయింది. వెంటనే అనిల్ గది తలుపులు పగులగొట్టి ఆమెను బయటకు తీసుకొచ్చాడు. అనంతరం అతను పరిగి వెళ్లిపోయాడు. తీవ్ర మనస్థాపానికి గురైన శిరీష బయటకు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. శిరీష ఇంట్లో నుంచి వెళ్లిపోయిన విషయాన్ని ఆమె తమ్ముడు.. అనిల్ కు ఫోన్ చేసి చెప్పాడు. అప్పటికే తన మిత్రులతో కలిసి అనిల్ ఫుల్లుగా మద్యం సేవించాడు. మరో బీర్ తీసుకొని స్నేహితుడితో కలిసి కాళ్లాపూర్ బయలుదేరాడు. గ్రామ శివారులో ఉన్న మైసమ్మ గుడి దగ్గర అతనికి శిరీష కనిపించింది. ఆగ్రహంతో శిరీషపై అనిల్ చేయి చేసుకున్నాడు. అక్కడే ఉన్న కుంటవైపు లాక్కెళ్లి వెంట తెచ్చుకున్న బీరు బాటిల్ ను పగులగొట్టిన అనిల్ స్నేహితుడు.. శిరీష కళ్లలో గుచ్చినట్లు సమాచారం. బాటిల్ గుచ్చడంతో అయిన గాయాలకు శిరీష కన్నీరుమున్నీరుగా విలపించింది. తనను వదిలేయమంటూ ఎంతగానో వేడుకుంది. మద్యం మత్తులో ఉన్న ఆ క్రూరులు.. మోకాళ్ల లోతు ఉన్న నీటి కుంటలో పడేశారు. ఆపై అనిల్ సహా అతని ఇద్దరు స్నేహితులు శిరీష చనిపోయే వరకూ ఆమెపైనే నిల్చున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే శిరీష చనిపోయినట్లు నిర్ధారించుకున్న తర్వాత నిందితులు అక్కడి ఆనవాళ్లను మాయం చేశారు. కుంటలో పడేసి ఇంటికి వెళ్లిపోయారు. ఆమె కనిపించడం లేదని వెతుకుతున్నట్లుగా నాటకం ఆడడం ప్రారంభించారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేయడం.. ఈ కథంతా జరగడం అందరికీ తెలిసిందే. అయితే ఇందుకు సంబంధించిన పూర్తి విషయాలను పోలీసులు వెల్లడించలేదు. పోలీసుల కస్టడీలోని ఇద్దరు నిందితులూ ఉన్నట్లు సమాచారం. మరికొన్ని గంటల్లో ఇందుకు సంబంధించిన పూర్తి విషయాలు వెలుగులోకి వస్తాయి. వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామానికి చెందిన 19 ఏళ్ల శిరీష.. శనివారం (జూన్ 10) రోజు రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతసేపు అవుతున్నా ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. తెలిసిన స్నేహితులు, బంధువులు అందరికీ ఫోన్ లు చేశారు. ఎక్కడా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. అయితే ఆదివారం రోజు ఉదయం గ్రామ సమీపంలోని నీటి కుంటలో శిరీష శవమై తేలింది. విషయం గుర్తించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు.. మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే శిరీష మృతదేహంపై రక్తపు మరకలు ఉండడంతో ఆమెను ఎవరో హత్య చేసినట్లు భావించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. ఆమెది దారుణమైన హత్య అని తేలింది.

# సొమ్ము కేంద్రానిదైతే... సోకు బీఆర్ఎస్ నేతలది

**కరీంనగర్ :**

కరీంనగర్ లోని తీగలగుట్టపల్లి ఒఅ ఔసీ.18 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించి టెండర్లు ఖరారయ్యాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇది తమ ఘనతగా చెప్పుకుంటూ, బీఆర్ఎస్ నేతలు సీఎంకు పాలాభిషేకం చేస్తూ సంబురాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆర్వోబీ కి కేంద్రం ఆమోదం తెలిపి 7 నెలలైనా ఇంతవరకు ఎందుకు టెండర్ పనులను ఖరారు చేయలేదో సమాధానం చెప్పాలి. గత నెల టెండర్లకు ఆహ్వానించి మళ్ళీ వెనక్కు తీసుకోవడానికి కారణం ఏంటో ప్రజలకు తెలపాలి. ఆర్వోబీ నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం ?126.74 కోట్లను కేంద్రమే చెల్లించేందుకు అంగీకరించిన విషయం నిజం కాదా? అని బీఆర్ఎస్ నేతలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణ పనులను ప్రారంభించి తొందరగా పూర్తి చేయాలని అనేకమార్లు తాను తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం వాస్తవం కాదా ? జాప్యాన్ని నిరసిస్తూ బిజెపి నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేసింది నిజం కాదా ? అని బండి సంజయ్ అడిగారు. ''గత సంవత్సరం ఆర్వోబీ నిర్మాణానికయ్యే ఖర్చులో 80 శాతం వాటా చెల్లించడానికి తొలుత అంగీకరించి, ఆ తరువాత మాట తప్పింది ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? ఆ తర్వాత ఒక బాధ్యత గల పార్లమెంట్ సభ్యుడిగా కరీంనగర్ ప్రజల అవసరాలను, అవస్థలను దృష్టిలో ఉంచుకొని, కేంద్ర ప్రభుత్వాన్ని ఈ ఆర్వోబి నిర్మాణ వ్యయం మొత్తం భరించేందుకు ఒప్పించినట్లు తెలిపారు. ఈ నిర్మాణాన్ని మేమే చేస్తామని కేంద్రానికి చెప్పి, ఇన్ని రోజులు జాప్యం చేస్తూ, కరీంనగర్ ప్రజల అవస్థలకు కారణం అయ్యారు. తిరిగి కేంద్రం వల్లే జాప్యమవుతోందంటూ కేంద్రంపై నిందలేస్తారా ?" అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా... ఆర్వోబీ నిర్మాణం విషయంలో జరుగుతున్న జాప్యానికి తామే కారణమంటూ ముక్కు నేలకు రాసి, కరీంనగర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. దీంతోపాటు వెంటనే పనులు ప్రారంభించి, నిర్ణీత వ్యవధిలో పూర్తి చేసి కరీంనగర్ ప్రజల ఇబ్బందులను తొలగించాలని బండి సంజయ్ ట్వీట్ ద్వారా డిమాండ్ చేశారు.

# పేదలకు ఉచితంగా కీలక శస్త్రచికిత్సలు- రక్తదానం చేసిన మంత్రి పువ్వాడ

**ఖమ్మం**

నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అంటూ ఓ సినీ కవి రాసిన పాట ఇప్పుడు పూర్తిగా రివర్స్ అయిపోయిందని, నేను వస్త బిడ్డో సర్కారు దవాఖానకు అని పాడుకునే రోజులు వచ్చాయని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రేడియోలజి ల్యాబ్, డయాలసిస్ సెంటర్, కీమోతెరఫీ వార్డులను మంత్రి పువ్వాడ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సమకూర్చిన న్యూట్రిషన్ కిట్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు ఇదే హాస్పిటల్ లో కనీసం సరిపడా డాక్టర్స్ ఉండేవారు కాదు, స్వల్ప సంఖ్యలో నర్సులు, సిబ్బంది ఉండే వారని.. కానీ నేడు తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఏ విభాగంకు ఆ విభాగంలో ప్రత్యేక వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఉన్నారని అందుకు ప్రభుత్వంకు మంత్రి హరీష్ రావుకి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు 250 పడకలలోనే 500 మంది రోగులు, ఒక్కో బెడ్ కు ఇద్దరు పేషంట్స్ ఉండేవారని ఇవన్నీ తనకి స్వయంగా తెలుసని అన్నారు. కానీ నేడు తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 500 బెడ్స్ కు పెంచుకున్నమని, దీనికి తోడు ప్రత్యేక మాతా శిశు కేంద్రం, ట్రామా కేర్, క్రిటికల్ కేర్ యూనిట్, డయాలసిస్ ఇలా అనేక సేవలు ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. గర్భిణిల కోసం ఆరోగ్య మహిళ పథకం, కంటి వెలుగు పథకం ద్వారా కొన్ని లక్షల మందికి ఉచిత కంటి పరీక్షలు చేపట్టి లక్షల మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఏ వైద్య పరీక్ష కావాలన్నా.. ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు చేస్తారని సూచించారు. నేడు వరల్డ్ బ్లడ్ డొనర్స్ డే సందర్భంగా మంత్రి పువ్వాడ రక్త దానం చేశారు. అనంతరం జిల్లాలో పని చేస్తున్న ఉత్తమ వైద్యులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు, మెమెంటోలు బహుకరించి అభినందించారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ది సంస్థ చైర్మన్ కొండబవాల కోటేశ్వర రావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎఖ గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆఓఊూ డాక్టర్ బి మాలతీ, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ వి ఎన్ సాగర్, నందగిరి శ్రీను, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వర రావు, ఆసుపత్రి సూరింటెండెంట్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

# లండన్‌లో తెలంగాణ యువతి దారుణ హత్య

**హైదరాబాద్ :**

ఉన్నత చదువుల కోసం లండన్‌లో ఉంటున్న రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ యువతిని బ్రెజిల్‌కు యువకుడు చంపేశాడు. బ్రాహ్మణపల్లికి చెందిన 27 ఏళ్ల తేజస్విని రెడ్డి లండన్‌లో ఎంఎస్ చేస్తున్నారు. మిత్రులతో కలిసి ఉంటున్నారు. ఆమెపై రాత్రి బ్రెజిల్‌కు చెందిన యువకుడు కత్తితో దాడి చేశాడు. ఆమెతోపాటు ఫ్రెండ్‌పై కూడా నిందితుడు అటాక్ చేశాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం బ్రాహ్మణపల్లికి చెందిన తేజస్విని.. లండన్‌లో ఎమ్మెస్ చదువుతోంది. తండ్రి అనారోగ్యం కారణంగా ఆరునెలల క్రితమే ఇంటికి వచ్చి తిరిగి వెళ్లిపోయింది. అంతలోనే తేజస్విని మరణవార్త వినాల్సి వస్తుందని ఊహించలేదంటూ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మరో రెండు నెలల్లో కోర్సు పూర్తి చేసుకుని ఇంటికి రావాల్సి ఉన్న తమ బిడ్డ ఇక లేదనే నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. తేజస్విని కుటుంబాన్ని ఓదార్చడం ఎవరి వల్లా కావడం లేదు. తేజస్వినికి సంబంధాలు కూడా చూస్తున్నారు కుటుంబసభ్యులు. అంతలోనే దారుణం జరిగిపోయిందంటూ గుండెలు బాదుకుంటున్నారు. దీంతో బ్రహ్మణపల్లిలో విషాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో తీవ్ర గాయాలపాలైన తేజస్విని చనిపోయారు. ఆమె స్నేహితురాలు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రెండు నెలల క్రితమే తేజస్విని లండన్ వేళ్లారు.

# సంక్రాంతికి రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'





మాస్ మహారాజా రవితేజ ఇప్పుడు ఫుల్ ఫామ్ లో ఉన్నాడు. హిట్టు, ప్లాప్స్ తో తో సంబంధం లేకుండా వరుస సినిమాలను ప్రకటిస్తున్నాడు. రీసెంట్ గా 'రావణాసుర' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించిన రవితేజ ఈ దసరాకి 'టైగర్ నాగేశ్వరరావు'గా ఆడియన్స్ ముందుకు రాబోతున్నాడు. కాగా ఇప్పుడు తన కొత్త సినిమా 'ఈగల్'ను రాబోయే సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు ప్రకటించి ఫ్యాన్స్ లో మరింత జోష్ నింపాడు. రీసెంట్ టైమ్ లో మాస్ మహారాజా రవితేజ కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బాస్టర్ హిట్ అందుకున్న సినిమా 'ధమాకా'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఇదే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తో 'ఈగల్' మూవీ చేస్తున్నాడు రవితేజ. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ నుంచి దర్శకుడిగా మారిన కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్లో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇక ఈ సినిమాకి 'ఈగల్' టైటిల్‌ను ప్రకటిస్తూ రిలీజ్ చేసిన టీజర్ వీడియోలో రవితేజ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్. అతన్ని పట్టుకోవడానికి రా ఏజెన్సీ వెతుకుతూ ఉంటుంది. ఇంతలో ఓ వ్యక్తి అతను పత్తి పండించే రైతు అని చెబుతాడు. తనకి ఇంకొన్ని అవతారాలు కూడా ఉన్నాయి. చివరగా రవితేజ ఓ నది దగ్గర నిలబడి పాక్షికంగా ఉన్నతన ముఖాన్ని చూపిస్తారు. ఆ తర్వాత 'ఈగల్' అనే టైటిల్ ని టైటిల్ ని రివీల్ చేశారు. టైటిల్ ప్రజెంటేషన్ లో భాగంగా విడుదలైన ఈ గ్లిమ్స్ వీడియో లో అనుపమ పరమేశ్వరన్, నవదీప్, మధుబాల వంటి తారాగణం కూడా కనిపించారు. కావ్య థాపర్ మరో హీరోయిన్ గా నటిస్తోంది. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభట్ల సంయుక్తంగా నిర్మిస్తున్న సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాదులో జరుగుతోంది. ఇక గ్లిమ్స్ వీడియో లోనే ఈగల్ సినిమా 2024 సంక్రాంతికి విడుదల కానుందని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. అయితే ఈ సినిమా కంటే ముందు సూపర్ స్టార్ మహేష్ బాబు 'గుంటూరు కారం' సంక్రాంతి బెర్త్ ని కన్ఫర్మ్ చేసుకుంది.త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా జనవరి 13న సంక్రాంతి కానుక విడుదల కాబోతోంది. దీంతో 2024 సంక్రాంతికి రవితేజ – మహేష్ బాబుల మధ్య బాక్సాఫీస్ వార్ జరగబోతోంది. నిజానికి ఈ ఇద్దరు హీరోలకు సంక్రాంతి సీజన్ మంచి సక్సెస్ ని అందించింది. గతంలో రవితేజ నటించిన 'క్రాక్' సినిమా సంక్రాంతికి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'సరిలేరు నీకెవరు' సైతం సంక్రాంతి కానుకగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. అయితే ఈసారి మాస్ మహారాజా రవితేజ 'ఈగల్' మూవీ సూపర్ స్టార్ మహేష్ బాబు 'గుంటూరు కారం' తో పోటీ పడనుంది. మరి ఈ పోటీలో ఎవరిది పై చేయి అవుతుందో చూడాలి. ఇక 'గుంటూరు కారం' విషయానికొస్తే.. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై ఎస్ రాధాకృష్ణ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. సినిమాలో మహేష్ బాబు కి జోడిగా పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్ గ్లిమ్స్ కి అనూహ్య స్పందన లభించింది. 'అతడు', 'ఖలేజా' వంటి సినిమాల తర్వాత త్రివిక్రమ్ – మహేష్ కాంబోలో రాబోతున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్ ఎంటర్టైనర్ గా యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాకి ఎస్,ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు.

# పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్, పరుశురామ్ చిత్రం



విజయ్ దేవరకొండ మరియు పరశురామ్ కలిసి సినిమా చేయబోతున్నారన్న విషయాన్ని కొద్ది రోజుల ముందు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. గీత గోవిందం మరియు సర్కారు వారి పాట వంటి బ్లాక్ బస్టర్ సినిమాలను తీసిన పరశురామ్ డైరెక్ట్ చేయనున్న ఈ సినిమా ను నిర్మాత దిల్ రాజు శిరీష్ లు నిర్మిస్తుండగా , క్రియేటివ్ ప్రొడ్యూసర్ గా వాసు వర్మ వ్యవహరించనున్నారు. ఈ కాంబినేషన్ పై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. హైదరాబాదులో ఈరోజు ఈ సినిమా ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, ఫస్ట్ షార్ట్ ను గోవర్ధన్ రావు దేవరకొండ డైరక్ట్ చేశారు, ప్రముఖ ఫైనాన్షియర్ సత్తి రంగయ్య కెమెరాను స్విచ్ ఆన్ చేశారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలు కాబోతోంది. సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యి అందరినీ తన పర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్న మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో విజయ్ సరసన హీరోయిన్ గా నటించబోతోంది. నిర్మాతలు దిల్ రాజు మరియు శిరీష్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా ద్వారా విజయ్ దేవరకొండ మొదటిసారి వారితో చేతులు కలిపారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై 54 వ చిత్రంగా భారీ బడ్జెట్ తో తెరకెక్కబోతోంది ఈ సినిమా. ఇక మిగతా వివరాలు త్వరలోనే తెలియజేయడం జరుగుతుంది

# కింగ్ నాగార్జున లాంచ్ చేసిన కె దశరథ్, డివై చౌదరి 'లవ్ యూ రామ్' మనసు మాట వినదే పాట



క్లాసిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ లతో ఆకట్టుకున్న దర్శకుడు కె దశరథ్ అందిస్తున్న కథతో తెరకెక్కుతున్న చిత్రం 'లవ్ యూ రామ్'. ఈ చిత్రానికి డివై చౌదరి దర్శకత్వం వహిస్తున్నారు. డివై చౌదరి, కె దశరథ్ కలిసి మన ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ చక్ర ఫిలింస్ బ్యానర్ లపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ జంటగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, టీజర్, పాట కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.తాజాగా ఈ చిత్రం నుంచి 'మనసు మాట వినదే' పాటని కింగ్ నాగార్జున లాంచ్ చేశారు.కె వేద ఈ పాటని లవ్లీ మెలోడీగా కంపోజ్ చేయగా.. దివ్య మాలిక శ్రావ్యంగా ఆలపించారు. వరికుప్పల యాదగిరి సాహిత్యం అందించిన ఈ పాటలో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ అందంగా వుంది.సుధాకర్ బొర్రా (టేనస్సీ), డి నాగేశ్వర్ రావు సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ గోపు, శివ మొక్క స్క్రీన్ ప్లే అందించారు. ప్రవీణ్ వర్మ మాటలు రాశారు. సాయి సంతోష్ కెమెరామెన్ గా, ఎస్.బి ఉద్ధవ్ ఎడిటర్ గా పని చేస్తున్నారు

తారాగణం: రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్, బెనర్జీ, ప్రదీప్, కాదంబరి కిరణ్, కార్టూనిస్ట్ మల్లిక్, మీర్, కె దశరథ్, డివై చౌదరి, ప్రభావతి వర్మ, శాంతి దేవగుడి తదితరులు

# దిశా పటాని పుట్టిన రోజు సందర్భంగా 'ప్రాజెక్ట్ ఐ' నుంచి ప్రీ లుక్ విడుదల




రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యూచరిస్టిక్ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ప్రాజెక్ట్ ఐ' క్రియేటివ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీస్‌లో ఒకటి. షూటింగ్ ప్రారంభించే ముందు టీమ్ యూనిక్ ప్రమోషన్‌లతో ఆకట్టుకున్నారు. ఫ్రమ్ స్క్రాచ్ అనే ప్రీ-ప్రొడక్షన్ పనుల వీడియోలను విడుదల చేశారు. నటీనటుల పుట్టినరోజుల కోసం ప్రీ-లుక్ పోస్టర్‌లను కూడా రివిల్ చేశారు. ఇదివరకే ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్ ల ప్రీ లుక్ పోస్టర్లను విడుదల చేశారు. నిన్న పుట్టినరోజు జరుపుకున్న నటి దిశా పటానీ ప్రీ లుక్ పోస్టర్ ని మేకర్స్ విడుదల చేశారు.

ప్రీలుక్ పోస్టర్ లో దిశా పటాని పెళ్లి కూతురు గెటప్‌లో నుదిటిపై పెళ్లి బొట్లుతో కనిపిస్తుంది. పోస్టర్ లో ఆమె పదునైన కళ్ళు చూడవచ్చు. దర్శకుడు నాగ్ అశ్విన్ స్క్రిప్ట్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రపంచ స్థాయి నిర్మాణ ప్రమాణాలతో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. టెక్నికల్ గా ఈ సినిమా మరో స్థాయిలో ఉండబోతోంది. 50 మెమరబుల్స్ ఇయర్స్ జరుపుకుంటున్న టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ఈ గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. అశ్విని దత్ నిర్మాత. ప్రాజెక్ట్ ఐ జనవరి 12, 2024న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950